

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 23-06-2025 | సంపుటి - 24 | సంచిక - 52 | రూ : 4 | పేజీలు: 8

# రణ'రంగంలోకి అమెరికా

- ఇరాన్ అణుకేంద్రాలపై శక్తిమంతమైన బీ2 బాంబర్లతో దాడి
- ఫోర్డో అణుశుద్ధి కేంద్రంపై బంకర్ బస్టర్ బాంబులు
- నతాంజ్, ఇస్ఫహాన్‌లపై తోమహాక్ క్షిపణులు
- 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో దాడులు
- 40 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడి
- బహుళ వార్‌హెడ్ల ఖోరాంశహర్-4 ప్రయోగం
- దద్దరిల్లిన ఇజ్రాయెల్
- పలు భవనాలు నేలమట్టం
- శాంతించాలని ప్రపంచ దేశాల పిలుపు
- చర్చలకు తావే లేదన్న ఇరాన్
- ఆ దేశాధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచన
- హర్మూజ్ జల సంధి మూసివేతకు ఇరాన్ యోచన
- రవాణాపై ప్రభావం పడే అవకాశం



2లో




## 'రేషన్'కు 76,842 మంది అనర్హులు

- క్షేత్రస్థాయి విచారణ పూర్తి
- క్షేఇకపై వారికి కోటా నిలిపివేత

హైదరాబాద్: రాష్ట్రంలో అనుమానాస్పద రేషన్ కార్డులపై క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియ పూర్తయింది. గత 6 నెలల్లో రేషన్ తీసుకోనివారి వివరాలను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఈ మేరకు లబ్ధిదారుల్లో 76,842 మంది అనర్హులుగా లెక్క తేలింది. ఈ వివరాలను పౌర సరఫరాలశాఖ జిల్లాలవారీగా కలెక్టర్లకు పంపించింది. కొద్ది రోజుల్లోనే వారిని రేషన్ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. ఇకనుంచి వారికి రేషన్ కోటా నిలిపివేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి. రేషన్ లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం ఇస్తున్నప్పటికీ చాలామంది తీసుకోవడం లేదు. ఇలా కనీసం గత 6 నెలలుగా రేషన్ తీసుకోనివారిని అనుమానాస్పద రేషన్ లబ్ధిదారులుగా గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారి వివరాల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. పౌర సరఫరాలశాఖ ఈ వివరాల్ని జిల్లా కలెక్టర్లకు పంపించి

తరువాయి 2లో



## క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి సహకరిస్తాం

- డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

హైదరాబాద్: ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడు ఆదివారం జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని దత్తాత్రేయుడు అభినందించారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి అన్ని విధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలిపారు.

## 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో



# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన కాంగ్రెస్...

- తెలంగాణ ప్రజల ఆకాంక్షలు భాజపాతోనే నెరవేరుతాయి
- 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్, భారాసలు 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని, శాసనసభ ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో.. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎన్నికై ఏడాదైన సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ' జరిగింది. ముఖ్య అతిథిగా కిషన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. "ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం. కేసీఆర్ కుటుంబం బారినపడి రాష్ట్రం ఏ రకంగా దెబ్బతిన్నదో మనకు తెలుసు. ధనిక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రూ.లక్షల కోట్ల అప్పులపాలైంది. కేసీఆర్‌ను వద్దనుకొని సోనియా గాంధీ, రాహుల్‌గాం

తరువాయి 2లో

## చర్చలు, దౌత్యంతో ఉద్రిక్తత సడలించుకోండి

- ఇరాన్ అధ్యక్షుడిని ఫోన్లో కోరిన మోదీ

దిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉద్రిక్తతల్ని సడలించుకోవాలని పిలుపునిచ్చారు. ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ఆదివారం మోదీతో ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుత దాడులను ఆపేయాలని, శత్రుత్వాన్ని తగ్గించుకోవాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. ప్రాంతీయంగా వీలైనంత త్వరగా శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించాలంటే చర్చలే మార్గమని గట్టిగా చెప్పారు. ప్రస్తుత పరిస్థితిపై ఇరువురూ సమగ్రంగా చర్చించుకున్నామని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. శాంతి, మానవత్వాల వైపే భారత్ ఉంటుందని చెప్పారు. భారతీయుల్ని ఇరాన్ నుంచి క్షేమంగా తీసుకురావడంలో పెజెష్కియాన్ అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక సహకారం, శాస్త్రసాంకేతిక రంగాలు, ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకునేలా పనిచేసేందుకు కట్టుబాటును ఇరువురు నేతలు పునరుద్ఘాటించారు. తరచూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలని నిర్ణయించుకున్నారు.



## సింగయ్య మృతి కేసులో ఏ2గా జగన్

- ఏ1గా వాహన డ్రైవర్ రమణారెడ్డి
- నిందితులుగా వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడదల రజని
- తెలిసీ మృతికి కారణమయ్యారని సెక్షన్లు మార్చిన పోలీసులు

2లో




### బసవతారకం
## ఆసుపత్రి కృషి అద్భుతం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం: మంత్రి రాజనర్సింహ
- సందడిగా ఆసుపత్రి రజతోత్సవం

బంజారాహిల్స్: రోగులకు అధునాతన వైద్యం అందించి రోగుల ప్రాణాలను కాపాడటంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి కృషి అద్భుతమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ) రజతోత్సవం ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో ఘనంగా జరిగింది. ఉదయం నిర్వహించిన కార్యక్రమంలో దివంగత ఎన్టీఆర్, బసవతారకం ప్రతిమలతో ఏర్పాటుచేసిన భారీ పైలాన్‌ను ట్రస్ట్ ఛైర్మన్, శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ఆవిష్కరించారు. ఆసుపత్రిలో దేశంలోనే తొలిసారిగా ఏర్పాటుచేసిన అత్యాధునిక లీనియర్

తరువాయి 2లో

# 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతాం

నకిరేకల్ : తల తాకట్టుపెట్టయినా రానున్న మూడున్నరేళ్లలో పేదలకు 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని... ఆ తర్వాతే అసెంబ్లీ ఎన్నికల్లో మీ గుమ్మం వద్దకు వచ్చి ఓట్లు అడుగుతామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వులు పంపిణీచేసే సభలో మాట్లాడారు. పదేళ్లలో గత ప్రభుత్వం 93 వేల ఇళ్లను మొదలు పెట్టి 66 వేలు పూర్తి చేసిందని.. మిగిలినవి మొండిగోడలతోనే దర్శనమిచ్చాయని విమర్శించారు. ''పేదలకు ఇళ్లను నిర్మించి ఇచ్చే గృహనిర్మాణ శాఖనే నాటి ప్రభుత్వం రద్దు చేసింది. ప్రభుత్వం ప్రతి సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చే నిధుల విషయంలో ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయదు. అలాగే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తిచేసేందుకు నిధులిస్తాం. కలెక్టర్లు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలి. భూభారతి చట్టం ద్వారా నిర్వహించిన సదస్సుల్లో రాష్ట్రంలో 8.60లక్షల దరఖాస్తులు వచ్చాయి. గత పాలకులు వారు అంటించుకున్న బంకను నేడు బనకచర్ల విషయంలో మాకు అంటించేందుకు తాపత్రయపడుతున్నారు. ఈ అంశం 2016లో మొదలైంది. నాటి నుంచి ఏడేళ్లు అధికారంలో ఉన్న వారు అప్పుడు ఏం చేశారు? గోదావరిలో 400 టీఎంసీల గురించి తెలంగాణ పక్షాన కేంద్రం వద్ద గాని, కోర్టులో గాని నోరు విప్పారా? నాడు అధికారంతో ప్రజల ఆస్తులు కొల్లగొట్టిన అంశాలపై విచారణలు తుదిదశకు వచ్చాయి. తప్పుచేసిన వారు అసలు, మిత్తీతో శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. రప్పారప్పా అంటూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారు. భద్రాచలం రామాలయానికి ఒక్కసారే వచ్చిన నాటి సీఎం రూ.వంద కోట్లతో అభివృద్ధి చేస్తానని చెప్పి వంద పైసలు కూడా ఇవ్వలేదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో రామాలయ అభివృద్ధికి రూ.90 కోట్ల వరకు వ్యయం చేశాం.. రూ.110 కోట్లైనా ఖర్చు చేస్తాం'' అని మంత్రి వివరించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, మందుల సామేల్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# 'రేషన్'కు 76,842 మంది అనర్హులు

(మొదటిపేజీ తరువాయి)

మండలస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం ద్వారా స్థానికంగా విచారణ జరిపించింది. ఇందులో అర్హులు, అనర్హులను గుర్తించి ఆ వివరాల్ని పౌరసరఫరాలశాఖకు పంపించగా, రేషన్ జాబితా నుంచి తొలగించాలని నిర్ణయించింది.

*** వలసలు, రెండుచోట్ల పేర్లు..**

అనుమానాస్పద లబ్ధిదారుల్లో 60 శాతం మంది అనర్హులుగా తేలారు. ఇందులో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు, చనిపోయినవారు, రెండుచోట్ల రేషన్ కార్డుల్లో పేర్లున్నవారు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయి వివరాల ఆధారంగా పంపిన నివేదికలతో వారి పేర్లను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. అనర్హులుగా తేలినవారు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు.



# ఒహాయోలో అష్టాంగ విమాన ఆలయం

మధిర: ప్రపంచంలోనే నాలుగో 'అష్టాంగ విమాన' ఆలయం అమెరికాలోని ఒహాయో రాష్ట్ర రాజధాని కొలంబస్‌లో సిద్ధమవుతోంది. ఈ ఆలయాన్ని మూడు అంతస్తులుగా నిర్మిస్తున్నారు. సహజంగా ఆలయాల నిర్మాణం పూర్తయ్యాక విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ మాత్రం రెండు, మూడు అంతస్తులు నిర్మించడానికి ముందే అందులో విగ్రహాలను శనివారం ప్రతిష్ఠించారు. మొదటి అంతస్తులో ఇప్పటికే వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా... రెండో అంతస్తులో యోగా నృసింహస్వామి (కృష్ణా జిల్లా వేదాద్రిలో ఉన్నట్లుగా) విగ్రహాన్ని, మూడో అంతస్తులో రంగనాథ స్వామి విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠాపన చేసినట్లు అక్కడి అర్చకులు రామకృష్ణరామానుజం తెలిపారు. ఆలయాన్ని 2027 నాటికి పూర్తి చేసి మహాకుంభాభిషేకం చేస్తామని వెల్లడించారు. యోగా నృసింహస్వామి విగ్రహం బరువు 2 టన్నులు, రంగనాథ స్వామి విగ్రహం పడగతో కలిపి 9.5 టన్నులు ఉంది. ఈ విగ్రహాలను భారత్‌లో తయారు చేయించి అమెరికాకు తీసుకెళ్లారు. రామకృష్ణ రామానుజంతో పాటు అర్చకులు వేణుగోపాల్ వేదగిరి, విష్ణు, అమెరికాలోని పలు ఆలయాలకు చెందిన అర్చకులు వచ్చి మూడు రోజుల క్రతువు నిర్వహించారు. విగ్రహాలకు అంకురార్పణం, హోమం, పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం చేసి విగ్రహాలను పెద్ద క్రేన్‌తో రెండు, మూడు అంతస్తుల్లో స్థాపన చేశారు. వేల మంది భక్తులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డెలావేర్ కౌంటీ అధికారులు హాజరయ్యారు. మరో మూడు అష్టాంగ విమాన దేవాలయాలు తమిళనాడులో ఉన్నాయని, వాటిని వేల ఏళ్ల కిందట నిర్మించారని రామకృష్ణ రామానుజం వివరించారు.



# 'రణ'రంగంలోకి అమెరికా

దుబాయ్, వాషింగ్టన్, టెల్ అవీవ్, టెహ్రాన్: పశ్చిమాసియా అగ్నికి అమెరికా ఆజ్యం పోసింది. నేరుగా యుద్ధ రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అత్యంత శక్తిమంతమైన బాంబర్లు, క్షిపణులతో విరుచుకుపడింది. 3 అణు కేంద్రాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ 40 క్షిపణులతో దాడులకు దిగింది. బహుళ వార్‌హెడ్ల ఖోరంశహర్4ను ప్రయోగించింది. దీంతో ఇజ్రాయెల్ దద్దరిల్లింది. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. పశ్చిమాసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో ప్రపంచ దేశాలన్నీ స్పందించాయి. ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, దౌత్య మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చాయి. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. శాంతి యత్నాలకు పిలుపునిచ్చారు. అమెరికా దాడులకు నిరసనగా ప్రపంచ వాణిజ్య మార్గమైన హర్మూజ్ జలసంధిని మూసివేయాలని ఇరాన్ యోచిస్తోంది. దీంతో అంతర్జాతీయ రవాణాకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉంది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం చేసే ఉద్దేశం తమకు లేదని అమెరికా రక్షణశాఖ వెల్లడించింది. కేవలం అణు స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపింది. నాయకత్వాన్ని మార్చాలనే ఆలోచనా లేదని రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ స్పష్టం చేశారు

**అణు కేంద్రాలే లక్ష్యంగా..**

ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై ఆదివారం తెల్లవారుజామున అమెరికా దాడులు చేసింది. పర్వతాల అడుగున 90 మీటర్ల లోతున ఉన్న ఫోర్డో కేంద్రంపై బీ2 బాంబర్లతో 14 బంకర్ బస్టర్ బాంబులను వేసింది. 13,500కేజీల ఈ జీబీయూ57 బాంబులు పర్వతాల్లో అడుగుకు దూసుకెళ్లి పేలిపోయాయి. అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి లక్ష్యాలను ఛేదించి క్షేమంగా తిరిగి వచ్చాయి. దీంతోపాటు సబ్‌మెరీన్ల నుంచి 30 తోమహాక్ క్షిపణులతో మిగిలిన అణు కేంద్రాలపై అమెరికా విరుచుకుపడింది. ఈ దాడులు ఇరాన్ కాలమానం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 2.10 గంటలకు, అమెరికా కాలమానం ప్రకారం.. శనివారం రాత్రి 6.40, 7.05 గంటల మధ్య జరిగాయి. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీడియా ముందుకొచ్చి ప్రకటన చేశారు. అణు స్థావరాలను ధ్వంసం చేశామని చెప్పారు. 'ఫోర్డో ఈజ్ గాన్' అని వ్యాఖ్యానించారు. ఫోర్డో అణు కేంద్రం ప్రవేశ మార్గం ధ్వంసమైనట్లు శాటిలైట్ చిత్రాల్లో కనిపించింది. ఆ ప్రాంతంలో పొగ అలముకుంది. ప్లానెట్ ల్యాబ్స్ పీబీసీ అందించిన చిత్రాల్లో.. ఫోర్డో కేంద్రం ఉన్న పర్వతం ధ్వంసమైనట్లు కనిపించింది. ప్రవేశ మార్గాలన్నీ ధ్వంసమయ్యాయి. ఆ కేంద్రానికి చేరుకోవాలంటే ఇరాన్ మళ్లీ కొండను తవ్వాల్సి ఉంటుంది. ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసేందుకు అమెరికా 7 బీ2 స్పిరిట్ బాంబర్లు సుదీర్ఘ సమయం ప్రయాణించాయి. ఇవి అమెరికాలోని మిస్సోరి నుంచి దాదాపు 18 గంటలపాటు ప్రయాణించాయి. ఈ విమానాలు గాల్లోనే ఇంధనం నింపుకొన్నాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తం 125 యుద్ధ విమానాలు పాలుపంచుకున్నాయి.

**కాంగ్రెస్ అనుమతి లేకుండానే..**

అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ ఇరాన్‌పై దాడికి దిగారు. అంతేకాకుండా అమెరికా బలగాలపై దాడులు చేస్తే మళ్లీ విరుచుకుపడతామని ఆయన హెచ్చరించారు. శాంతి కావాలో.. విషాదం కావాలో తేల్చుకోవాలని హితవు పలికారు. 'అన్ని విమానాలు ఇరాన్ గగన తలం నుంచి బయటకు వచ్చాయి. ఫోర్డోపై బాంబులను వేశాం' అని సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టులో ట్రంప్ వెల్లడించారు. 'అమెరికాకు, ఇజ్రాయెల్‌కు, ప్రపంచానికి ఇదొక చరిత్రాత్మక సమయం. ఇరాన్ ఇప్పుడు కచ్చితంగా యుద్ధానికి ముగింపు పలికేందుకు అంగీకరించాల్సిందే' అని వ్యాఖ్యానించారు.

- దాడులపై ట్రంప్ ప్రకటన అనంతరం శ్వేతసౌధంలోని పశ్చిమ భాగంలో లైట్లను ఆర్పేశారు. సైరన్ మోగింది. అయితే ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగలేదు.
- ఇరాన్ ఒప్పందానికి రాకుంటే మరిన్ని లక్ష్యాలపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు.

దాడుల అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ట్రంప్ ఫోన్ చేశారు. 'ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న మీ సాహసోపేత నిర్ణయం అద్భుతం. చరిత్ర గతిని అమెరికా మార్చనుంది' అని ట్రంప్‌ను ఆయన ప్రశంసలతో ముంచెత్తారు. ఇజ్రాయెల్, ప్రపంచంలోని యూదులందరి తరఫున శిరసు వంచి నమస్కరిస్తున్నానని పేర్కొన్నారు. అలవాటు ప్రకారం ఇరాన్‌కు ట్రంప్ రెండు వారాల గడువు ఇచ్చారేగానీ.. ఆయన రెండ్రోజులు కూడా ఆగలేదు. అమెరికాలోని వైట్‌మన్ ఎయిర్‌బేస్ నుంచి బీ2 బాంబర్లు, కేసీ135 స్ట్రాటో ట్యాంకర్లు బయల్దేరి వెళ్లాయి.

**ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం**

అమెరికా దాడులు చేసిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడింది. 40 క్షిపణులను ఆ దేశంపైకి ప్రయోగించింది. అందులో బహుళ వార్‌హెడ్లను మోసుకెళ్లగల అత్యంత శక్తిమంతమైన ఖోరంశహర్4 క్షిపణులూ ఉన్నాయి. ఈ దాడుల్లో టెల్ అవీవ్‌లోని ఒక బహుళ అంతస్తుల భవనం నేలమట్టమైందని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. 80 మందికి స్వల్ప గాయాలయ్యాయని వెల్లడించారు. అయితే ఆ భవనంతోపాటు ఆ వీధిలో ఉన్న పలు ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

- ఇజ్రాయెల్‌పై మూడో తరం ఖీబర్‌షెకన్ బాలిస్టిక్ క్షిపణులనూ ఇరాన్ ప్రయోగించింది. ఇది బహుళ వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు. దీనికి అడ్వాన్స్‌డ్ టెర్మినల్ గైడెన్స్ వ్యవస్థ ఉంది.
- ఇజ్రాయెల్‌లోని బెన్‌గెరియన్ విమానాశ్రయం, అతి పెద్ద బయాలాజికల్ పరిశోధన కేంద్రం, బ్యాకప్ మిలిటరీ కమాండ్ హబ్‌లపై ఇరాన్ దాడులు చేసింది. అవి తీవ్రంగా ధ్వంసమైనట్లు ఫొటోల్లో కనిపిస్తోంది. అయితే విదేశీ జర్నలిస్టులను ఆ ప్రాంతాల్లోని అనుమతించలేదు.
- వీటితోపాటు 14 వ్యూహాత్మక ప్రాంతాలపై ఇరాన్ దాడులు చేసింది. ఇందులో హైఫా, టెల్ అవీవ్‌లోని సైబర్ కమాండ్ సెంటర్లు, సైనిక పారిశ్రామిక మౌలిక వసతులు, ఏఐ పరిశోధన కేంద్రాలు ఉన్నాయి.
- ఇరాన్ వరుసగా ప్రయోగించిన క్షిపణులను అడ్డుకున్నామని, ప్రతిగా ఇరాన్ పశ్చిమ ప్రాంతంలోని సైనిక స్థావరాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.
- అమెరికా దాడుల అనంతరం తమ గగనతలాన్ని మూసివేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది.
- ఇరాన్‌లోని డెజ్‌ఫుల్ విమానాశ్రయంలో ఎఫ్5 విమానాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇస్ఫహాన్ విమానాశ్రయంతోపాటు మరికొన్ని ప్రాంతాలపై దాడులు చేశామని తెలిపింది.

# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

ధీ, రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. గడిచిన ఏడాదిన్నరలో ప్రజల నమ్మకాన్ని కాంగ్రెస్ వమ్ము చేసింది. అప్పులు ఇచ్చేవారు లేరని, తనను నమ్మేవారు లేరని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. కేంద్రం తెలంగాణకు ఇచ్చిన రూ.వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్రంలో జాతీయ రహదారులు అమెరికాను తలదన్నేలా ప్రపంచస్థాయిలో ఉన్నాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ లాంటి సాహసోపేత ఆపరేషన్లు చేపట్టారు. తెలంగాణకు మేలు జరిగి, ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే ప్రధాని మోదీ నేతృత్వంలో భాజపాతోనే సాధ్యం. ఈటల రాజేందర్ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా ఎంపీగా ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తున్నారు'' అని కిషన్‌రెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ హయాంలో జనగణనలో కులగణన చేసేందుకు నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి మోదీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ 'ప్రధాని మోదీ తెలంగాణ అభివృద్ధి ప్రదాత. రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడుతున్నారు. కేసీఆర్ అహంకారంతో ప్రధాని అని కూడా చూడకుండా మోదీపైనే విమర్శలు చేశారు. ప్రాజెక్టులకు భాజపా వ్యతిరేకం కాదు.. ఆ పేరుతో జరిగే అవినీతికి వ్యతిరేకం' అని చెప్పారు. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్ ప్రసంగించారు. సభ ప్రారంభానికి ముందు భాజపా సర్కారు అభివృద్ధిపై ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు, వేదికపై ఆడియో వీడియో ప్రదర్శన జరిగింది.

# బసవతారకం ఆసుపత్రి కృషి అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

యాక్సిలేటర్ రేడియో థెరపీ యంత్రాన్ని ముఖ్య అతిథి గవర్నర్ ప్రారంభించారు. గుండె సంబంధిత పరీక్షలు, చికిత్సకు ఏర్పాటుచేసిన అధునిక క్యాథ్ ల్యాబ్‌ను గౌరవ అతిథి మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు.

*** బాలకృష్ణ.. ఉన్నత లక్ష్యంతో పనిచేసే గ్రేట్ హీరో**

ఆసుపత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడారు. 'ఇటీవల బాలకృష్ణ నన్ను కలిసేందుకు వచ్చినప్పుడు.. ఓ గ్లామర్ హీరో వస్తున్నారని భావించా. ఆయనతో మాట్లాడిన తరువాత నా అభిప్రాయం మారింది. బాలకృష్ణ.. ఉన్నత లక్ష్యంతో పనిచేసే గ్రేట్ హీరో' అని అన్నారు. దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 5055 వేల మంది కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నారని నివేదికలు వెల్లడిస్తున్నాయని మంత్రి రాజనర్సింహ అన్నారు. ''త్వరలోనే అన్ని జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నాం. అధునాతన వైద్యసేవలు అందించేలా రీజినల్ క్యాన్సర్ కేర్ సెంటర్లను అందుబాటులోకి తెస్తాం'' అని తెలిపారు. జన్మనివ్వడమే గాక తనముందు మంచి లక్ష్యాన్ని ఉంచిన తల్లిదండ్రులకు ధన్యవాదాలని బాలకృష్ణ అన్నారు. వచ్చే ఏడాది ఇదే రోజున రజతోత్సవ ముగింపు కార్యక్రమాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో భారీఎత్తున నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా 'దామోదర్ రాజనర్సింహ గారు.. మీ పేరుతో సినిమా తీద్దామనుకుంటున్నాను' అని సరదాగా బాలకృష్ణ అనడంతో సభలో నవ్వులు విరిశాయి. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వెయ్యి పడకల క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుడతామని బాలకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ ట్రస్టు బోర్డు సభ్యులు జేఎస్ఆర్ ప్రసాద్, డా. రాఘవరావు పోలవరపు, డా. నోరి దత్తాత్రేయుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్, నారా బ్రాహ్మణి, సీఈవో డా. కె.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగయ్య మృతి కేసులో ఏ2గా జగన్

అమరావతి : రెంటపాళ్ల పర్యటన సందర్భంగా తాను వెళ్తున్న వాహనం కింద పడి చీలి సింగయ్య మృతికి కారణమైన వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో ఆయనను రెండో నిందితుడు(ఏ2)గా పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై గత వారం గుంటూరులోని నల్లపాడు స్టేషన్‌లో మృతుడు సింగయ్య భార్య లూర్థుమేరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్ఎస్‌లోని సెక్షన్ 106 (1) కింద కేసు నమోదు చేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వీడియో ఫుటేజీలలో సింగయ్య.. జగన్ వాహనం కిందే పడి మృతిచెందినట్లు వెల్లడవడంతో పోలీసులు ఈ కేసులో సెక్షన్లు మార్చారు. తెలిసీ మరణానికి కారణమయ్యారని బీఎన్ఎస్‌లోని 105, 49 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. వాహనం నడిపిన డ్రైవర్ రమణారెడ్డిని ఇదే కేసులో ఏ1గా చేర్చారు. ఏ3గా జగన్ వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి, ఏ4గా వైవీ సుబ్బారెడ్డి, ఏ5గా పేర్ని నాని, ఏ6గా విడదల రజిని తదితరులను చేర్చారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించిన వివరాల ప్రకారం...

**50 వాహనాలతో కాన్వాయ్**

''18న మాజీ సీఎం జగన్ తాడేపల్లి నుంచి రెంటపాళ్లలో విగ్రహావిష్కరణకు వెళ్లడానికి కాన్వాయ్‌లోని 11 వాహనాలతో పాటు 3 వాహనాలకు అనుమతి ఇచ్చాం. కానీ, ఆ నిబంధనలకు విరుద్ధంగా ఆయన తాడేపల్లి నుంచి 50 వాహనాల్లో బయల్దేరారు. నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సింగయ్యను జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో గాయపడిన సింగయ్యను రోడ్డుపక్కన పడుకోబెట్టినట్లు సమాచారం రావడంతో 108లో ఆసుపత్రికి తరలించాం. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సింగయ్య భార్య లూర్థుమేరీ ఫిర్యాదు మేరకు 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేశాం. దర్యాప్తులో భాగంగా ఆ రోజు జరిగిన ఘటనకు సంబంధించి వీడియో, సీసీ కెమెరా, డ్రోన్ వీడియోల ఫుటేజీలు పరిశీలించడంతో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించాం. మాజీ సీఎం జగన్ వాహనం ఫార్చూనర్ చక్రం కింద సింగయ్య పడిపోవడం, చక్రం అతనిపై ఎక్కుతున్నట్లుగా వీడియో ఆధారం దొరికింది





# తగ్గేదేలే.....!

* కుత్బుల్లాపూర్ లో పొలిటికల్ హీట్!
* కొలన్ వ్యాఖ్యలతో రాజుకున్న అగ్గి!
* ఖండించిన బిఆర్ఎస్ నాయకులు!
* పోటాపోటీగా విమర్శలు
* చర్చకు సిద్ధమా అంటూ కాంగ్రెస్ నాయకుల సవాల్

ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్: కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల పోటాపోటీ విమర్శలు, ప్రతి విమర్శలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాలిటిక్స్ హీటెక్కాయి.ఇరు పార్టీల ముఖ్య నాయకులు తమ తమ అధి నాయకులకు మద్దతుగా సమావేశాలు నిర్వహించి ప్రత్యర్థి పార్టీ నాయకులపైన ఘాటు విమర్శలు చేస్తుండటంతో చిలికి చిలికి గాలివానలా ఈ మాటల యుద్ధం ఎందాక పోతుందోనని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇన్నాళ్లు నియోజకవర్గంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఏదైనా మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందా అన్నట్టుగా ప్రశాంతంగా వున్న కుత్బుల్లాపూర్ లో ఒక్కసారిగా అధికార, ప్రతిపక్ష నాయకులు డివిజన్ స్థాయిలలో సైతం ఓ వైపు తమ అధినాయకులకు మద్దతుగా మాట్లాడుతూ, స్థానికంగా తమ ప్రత్యర్థి పార్టీలలో వున్న నేతలపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు.

### ఇలా మొదలైంది!

సూరారం డివిజన్ కృష్ణా నగర్ లో రెండు రోజుల క్రితం ఓ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఎమ్మెల్యే కే. పీ వివేకానందను ఉద్దేశించి... మూడు సార్లు ఎమ్మెల్యే గా గెలిచి ముప్పై చెరువులు, కుంటలను కబ్జా చేసాడన్న వ్యాఖ్యలతో కుత్బుల్లాపూర్ పాలిటిక్స్ లో అగ్గి రాజుకుందని చెప్పవచ్చు!ఆయన చేసిన వ్యాఖ్యలను కండిస్తూ చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు,ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. కొలన్ మాటలను కండిస్తూ ఆయన రాజకీయ ప్రస్థానంపై విమర్శలు చేసారు.తమ నాయకుడు,ఎమ్మెల్యే వివేకానంద చెరువుల కబ్జాలకు పాల్పడి ఉంటే ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని ఎలా అందించేవారని,హైడ్రా పేరుతో కోలన్ హన్మంత్ రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నాడని కొలన్ పై విమర్శలు గుప్పించారు! కోలన్ కు రాజకీయ బిక్ష పెట్టింది బిఆర్ఎస్ అని, జూబ్లీహిల్స్ లో వుండే ఆయనకు ప్రజల సమస్యలు ఏం తెలుస్తాయని విమర్శించారు.

### మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు!

కొలన్ హన్మంత్ రెడ్డి పై బిఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కోలన్ పై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు! తమ నాయకుడు హన్మంత్ రెడ్డి మాట్లాడింది వాస్తవం అని అన్నారు. బిఆర్ఎస్ నాయకుల విమర్శలకు ప్రతిగా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు బాచుపల్లి లోని కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.గత ప్రభుత్వం లో ఎమ్మెల్యే అనుచరులు కబ్జాలు చేసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒకనాడు హన్మంత్ రెడ్డి ద్వారా లబ్ది పొంది నేడు ఆయనపైనే విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు.ప్రజా క్షేత్రంలో గెలుపు ఓటములు సహజం అని, హైడ్రా పేరు చెబితే బిఆర్ఎస్ నాయకులు వణికిపోతున్నారని ఏద్దేవా చేసారు.రానున్న రోజుల్లో బిఆర్ఎస్ నాయకులు చేసిన కబ్జాలను వెలుగులోకి తెస్తామని,దమ్ముంటే శాపూర్ నగర్ చౌరస్తా లో చర్చ రావాలని బిఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు!

## చిరుమర్తి సోమయ్య ను పరామర్శించిన టీపీసీసీ స్పోక్ పర్సన్ సామ రాంమోహన్ రెడ్డి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : గత కొంత కాలంగా అనారోగ్యంతో భాధపడుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు తండ్రి చిరుమర్తి సోమయ్య కూకట్ పల్లి రాందేవ్ రావు హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. విఒషయం తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా, కమ్యూనికేషన్ చైర్మన్, టిపిసిసి స్పోక్ పర్సన్ సామ రాంమోహన్ రెడ్డి ఆదివారం పరామర్శించి సోమయ్య ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని రామ్మోహన్ రెడ్డి వైద్యులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సోమయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

## పీవీఆర్ అసోసియేట్ కార్యాలయం ప్రారంభం



ఫీర్జాదిగూడ , (ప్రజాస్ఫూర్తి) : పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి ప్రియ కాలనీ, రోడ్ నెంబర్ 3 లో నూతనంగా ఏర్పాటు చేసిన పీవీఆర్ అసోసియేట్ కార్యాలయంను ఆదివారం మాజీ మేయర్ అమర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, పీవీఆర్ అసోసియేట్ యాజమాన్య వెంకట్ రెడ్డి,స్థానిక కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల డివిజన్ లో జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొన్న కొలను



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ లో జరిగిన పలు కార్యక్రమాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వుడ్స్ ఎంక్లివ్ పార్క్ లో కాలనీ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ దేవస్థానంలో నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణ వారి బ్రహ్మోత్సవాల కార్యక్రమాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఎల్లప్పుడు సుఖ: సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరారు . అదే విధంగా జీడిమెట్ల డివిజన్ లోని లక్ష్మి గంగ ఎంక్లివ్ లో అసోసియేషన్ వారు నిర్వహించిన వెల్ఫేర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో అస్సోసియేషన్ సభ్యులు పలు సమస్యల గురించి పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కాలని వాసులు , అస్సోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత అండ

* కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత అండగా నిలుస్తుందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వేముల సాయికుమార్ రెడ్డి కి రూ. 60,000లు, కర్ణాక మని కి రూ.34,000లు, లలిత భాటి కు రూ.44,000లు, సుభాద్రకు రూ. 60,000 లు, ముత్యాపాగ కవితకు రూ.40,000లు సిఎంఆర్ఆఫ్ చెక్కులను పంపిణి చేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ఆఫ్ లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ నాయకులు తమ పదవుల కోసం ఉద్యమకారులను వాడుకుంటున్నారు

* తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



ప్రజాస్ఫూర్తి, కాప్రా: రాజకీయ నాయకులు తమ పదవుల కోసం ఉద్యమకారులను వాడుకుంటున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అన్నారు. ఉద్యమకారులెవరూ అధైర్యపడవద్దని ఉద్యమించి మన హక్కులు సాధించుకుందామని శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్ కాప్రా ప్రెస్ క్లబ్ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల భూములు ఉన్నాయని ఉద్యమకారులకు అందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పన్నెండు వందల మంది బలిదానాలు చేశారని గుర్తు చేశారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువకులు నేడు వయసు పైబడి అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమకారులను అన్నివిధా లుగా ఆదుకుంటామని చెప్పి పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉన్నా ఉద్యమకారులను పట్టించుకోకుండా ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉద్యమకారులకిచ్చిన హామీలు నెరవేర్చకపోతే మండల, జిల్లా స్థాయిలో ధర్నాలు నిర్వహించి రాష్ట్ర ఉద్యమకారుల పోరం ఆధ్వర్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు అందిస్తామని, ఆ తర్వాత ఇందిరా పార్కు వద్ద ధర్నాకు దిగుతామని అప్పటికీ ప్రభుత్వం దిగి రాకపోతే చలో డిల్లీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి డిల్లీలో పెద్ద ఎత్తున ధర్నా చేసి రాహుల్ గాంధీతో పాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రాలు అందిస్తామని చీమ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేసి ఉద్యమకారులందరికీ ఒక్కొక్కరికి 250 గజాల ఇళ్ల స్థలాలు, ఇరవై ఐదు వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్నలను పొందాలి : ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వినియోగదారుల మన్నలను పొందినప్పుడే వ్యాపారంలో అభివృద్ధి సాధ్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అన్నారు .ఆదివారం ఉప్పల్ నియోజకవర్గంలోని భవాని నగర్ రాధిక సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సన డిజైనర్ బోటిక్ షాపును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై షాపు నిర్వాహకులు రజియా, షేక్ హుస్సేన్ దంపతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారంలో ప్రజల మన్నలను పొందినప్పుడే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షాపు నిర్వాహకులు ఖాసీం అబ్దుల్ కలాం, మహమ్మద్ అక్బర్, ఖమ్మం టౌన్ 60వ డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు పింటూ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## బండారి రాజిరెడ్డి బాటలో నడుస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.



ప్రజాస్ఫూర్తి, కాప్రా : నిబద్ధత కలిగిన నాయకుడు తన సోదరుడు ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ని కోల్పోవడం బాధాకరం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణ రెడ్డి నగర్ ; బంజారా కాలనీ) లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అలాగే కాలనీ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు దివంగత నేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు.ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివి అని ఆయన అన్నారు. తను కూడా తన సోదరుని బాటలో నడుస్తూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావు నగర్ లో సందడి చేసిన యాంకర్ సుమ



ప్రజాస్ఫూర్తి, కాప్రా : చురుకైన మాటతీరు, చమత్కారంతో ప్రేక్షకులను ఎప్పుడూ అలరిస్తూ ఉంటున్న యాంకర్ సుమ ఆదివారం ఏఎస్ రావు నగర్ డివిజన్లో సందడి చేశారు. ఏఎస్ రావు నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ కు చీఫ్ గెస్ట్ గా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి ముచ్చటిస్తూ తన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ యాజమాన్యానికి దేశవ్యాప్తంగా తొమ్మిది వందల కు పైగా బ్రాంచ్లు ఉన్నాయని ప్రీస్కూల్ నిర్వహణ విషయంలో వారికి చాలా మంచి పేరు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు బోధించాలంటే ఉపాధ్యాయులకు ఎంతో సహనం, ఓపిక ఉండాలన్నారు. స్కూల్ అంటే మరో ఇల్లు లాంటిదని బుడిబుడి అడుగులతో అక్షరాలు దిద్దేందుకు వచ్చే పిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. చిన్నారుల సంరక్షణ విషయంలో లిటిల్ మిలీనియం స్కూల్ కు మంచి పేరు ఉందని ఈ సందర్భంగా సుమ గుర్తు చేశారు. బ్రాంచ్ నిర్వాహకులు శైలజ సౌందర్య కు శుభాకాంక్షలు తెలుపుతూ.. అన్ని బ్రాంచ్ల మాదిరిగానే ఏఎస్ రావు నగర్ బ్రాంచ్ కూడా మంచి గుర్తింపు తెచ్చు కునేలా తమ బోధన విధానం ఉండాలని, చిన్నారులు కష్టంతో కాకుండా ఇష్టంతో స్కూలుకు వచ్చేలా ఇక్కడ వాతావరణం క్రియేట్ చేయాలని సూచిస్తూ.. స్కూల్ నిర్వాహకులు విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

# హైదరాబాద్ ఆర్మీ కాలేజీలో ఆగంతుకుల కలకలం!

* హైదరాబాద్ ఆర్మీ కాలేజీలోకి నకిలీ ఐడీలతో నలుగురి చొరబాటు
* తాము ఎయిర్‌ఫోర్స్ అధికారులమని నమ్మించే విఫలయత్నం
* ఆర్మీ క్యాంటీన్‌లో ఉద్యోగాల పేరిట మోసమని పోలీసుల నిర్ధారణ
* ప్రధాన సూత్రధారి బీహార్‌కు చెందిన ఆశిష్ కుమార్
* ఉగ్రకోణం లేదని స్పష్టం చేసిన నార్త్ జోన్ డీసీపీ రష్మి
* నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు




హైదరాబాద్‌లోని తిరుమలగిరి ఆర్మీ ఇంజనీరింగ్ కళాశాలలోకి నలుగురు వ్యక్తులు నకిలీ గుర్తింపు కార్డులతో అక్రమంగా ప్రవేశించడం కలకలం రేపింది. తాము ఎయిర్‌ఫోర్స్ అధికారులమని నమ్మబలికి, నకిలీ ఐడీ కార్డులు చూపించి లోనికి ప్రవేశించిన వీరిని ఆర్మీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

**డీసీపీ వెల్లడించిన వివరాలు**


తిరుమలగిరి ఆర్మీ కళాశాలలోకి నలుగురు వ్యక్తులు అక్రమంగా చొరబడిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. “నార్త్ జోన్ పరిధిలో అనేక మిలటరీ, ఆర్మీ ప్రాంతాలున్నాయి. ఇది దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కాబట్టి, మీడియా సంయమనం పాటించాలి” అని ఆమె కోరారు. ఈ కేసులో ఎలాంటి ఉగ్రవాద కోణం లేదని ఆమె స్పష్టం చేశారు. “ప్రధాన నిందితుడు ఆశిష్ కుమార్, బీహార్‌కు చెందిన వ్యక్తి. ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడు. ఇతను గతంలో క్యాంటీన్ నిర్వహించిన అనుభవం ఉంది. ఆర్మీ కళాశాల క్యాంటీన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి, తనతో పాటు వచ్చిన మిగతా ముగ్గురిని ఆశిష్ మోసం చేశాడు. వారి దగ్గర నుంచి కమీషన్ కూడా తీసుకున్నాడు” అని డీసీపీ వివరించారు. ఆర్మీ కళాశాల ప్రాంగణంలో ఈ నలుగురు ఫోటోలు తీస్తుండగా ఆర్మీ సిబ్బంది గమనించి పట్టుకున్నారని తెలిపారు. ఆశిష్ కుమార్‌పై గతంలో బీహార్‌లో కూడా ఇలాగే ఓ మిలటరీ ప్రాంతంలోకి అక్రమంగా చొరబడిన కేసు నమోదైందని డీసీపీ రేష్మి వెల్లడించారు. “అన్ని కోణాల్లోనూ కేసును దర్యాప్తు చేస్తున్నాం. ఇలాంటి సున్నితమైన కేసుల దర్యాప్తులో మీడియా పోలీసులకు సహకరించాలి” అని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనతో ఆర్మీ కళాశాల పరిసరాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ ఐడీ కార్డులు, ఇతర ఆధారాలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

## వికాసీత్ భారత్ సంకల్ప సభలో పాల్గొన్న జెకె శేఖర్ యాదవ్



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : సికింద్రాబాద్ లోని ఇంపీరియల్ గార్డెన్ లో నిర్వహించిన వికాసీత్ భారత్ సంకల్ప సభలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఇన్చార్జ్ సునీల్, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ లను యాదవ సంఘం తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఖిల భారత యాదవ మహాసభ, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ కలసి గొంగడి తో సన్మానించి మేక పిల్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జగన్ ముదిరాజ్, యువ నాయకులు ఆర్థిక్ యాదవ్, రాజేష్ ప్రసాద్ రెడ్డప్ప, రవి, రాజు, ఆంజనేయులు, బీరప్ప, శ్రీకాంత్ కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, బిజెపి నాయకులు మల్లికార్జున, కురుమ యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గతంలో పనిచేసిన సంస్థకే కన్నం..
# రూ.48 లక్షలు చోరీ చేసిన నిందితుడు అరెస్ట్



హైదరాబాద్: గతంలో పనిచేసిన సంస్థకే కన్నం వేసిన ఓ ప్రబుద్ధుడు రూ.48లక్షలు అపహరించాడు. ఈ ఘటనలో బేగంపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి రూ.46లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. బేగంపేట ఠాణా పరిధిలోని పాటిగడ్డ సన్ స్టీల్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గతంలో అదే కంపెనీలో పనిచేసిన గిరిదారి సింగ్‌ను వివిధ కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించారు. మొన్న అర్ధరాత్రి సన్ స్టీల్స్ కంపెనీ వెనుక వైపు నుంచి అద్దం ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించాడు. అనంతరం లాకర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగదు అపహరించుకొని బస్సులో పరారయ్యాడు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా గిరిదారి సింగ్‌ను ఆదిలాబాద్‌లో గుర్తించి అక్కడి పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు.



## చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో స్వల్ప అగ్ని ప్రమాదం

హైదరాబాద్: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. త్యాగరాయ గానసభ ఒకటో అంతస్థులోని కళామారుతీ హాలులో షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి ఆర్పివేశారు. ఆ సమయంలో హాలులో కళాకారులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

## నాన్ ట్యాక్స్ రెవెన్యూపై అధికారులు దృష్టి పెట్టాలి
**: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్: నాన్ ట్యాక్స్ రెవెన్యూ రాబడులను పెంచడంపై అధికారులు దృష్టి సారించాలని ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ సబ్ కమిటీ ఛైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో జరిగిన అసెట్స్ సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మంత్రులు, కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ..గత ప్రభుత్వ పథకాలను ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ‘‘అధికారంలోకి వచ్చిన 202324 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఓఆర్ఆర్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయి. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నాం. బడ్జెట్ నిధులు కొన్ని శాఖలు అధికంగా.. మరికొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయి. బడ్జెట్‌లో అన్ని శాఖలకు సమానంగా పంచాలి. శాఖల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి.. అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలి. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన ప్రాజెక్టుల ప్రాముఖ్యతను అనుసరించి వెంటనే పూర్తి చేయాలి. రాష్ట్ర అవసరాలు, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులు ఖర్చు చేయాలి. రెవెన్యూ తీసుకువచ్చే శాఖలు, విభాగాలపై దృష్టి సారించాలి. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పనిచేయాలి. అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందుకు వెళ్తుంది. రాబోయే పది రోజుల్లో రేషనలైజేషన్ పూర్తి చేసి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి’’అని అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు.



## మీనాక్షి వద్దకు వరంగల్ కాంగ్రెస్ నేతల పంచాయితీ..

వరంగల్ కాంగ్రెస్ నేతల పంచాయితీ.. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌చెంతకు చేరింది. ఇటీవల కొండా మురళీ చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. రెండు రోజుల క్రితం వరంగల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు ఆఫీస్ లో భేటీ అయిన నేతలంతా ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్‌తో కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యానారయణ, రేవూరి ప్రకాశ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతోపాటు ముఖ్య నేతలు దాదాపు గంటకు పైగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా గడిచిన ఏడాదిగా వరంగల్ లో జరుగుతున్నటువంటి పరిణమాలు, కొండా ఫ్యామిలీకి సంబంధించినటువంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. కొండా దంపతులపై.. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ఇటీవల జరిగినటువంటి పరిణామాలు, ఆ పరిణామాలు వెనుక ఉన్నటువంటి కారణాలు అన్నింటికీ మీడియా ప్రకటనలకు సంబంధించినటువంటి క్లిప్పింగ్స్, డాక్యూమెంట్స్‌తో ఉమ్మడిగా నేతలు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా కొండా మురళీపై వెంటనే పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఒకదశలో పార్టీకి మేం కావాలో.. కొండా ఫ్యామిలీ కావాలో తేల్చుకోవాలని కూడా ఎమ్మెల్యేలు మీనాక్షితో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో మీనాక్షి నటరాజన్ కొండా మురళీ వ్యాఖ్యలు తమ దృష్టికి వచ్చాయని వారికి తెలిపారు.

## ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయం: మంత్రి శ్రీధర్‌బాబు




కరీంనగర్: అందరి సహకారంతో అన్ని రంగాల్లో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా నిలుస్తోందని మంత్రులు వ్యాఖ్యానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయంపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రధాన లక్ష్యం.. విద్య, వైద్యం, వ్యవసాయమని, ఈ విషయంలో పూర్తి బాధ్యత కలెక్టర్లదేనని మంత్రి శ్రీధర్‌బాబు తేల్చి చెప్పారు. వ్యవసాయానికి పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కర్షకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నామన్నారు. కరీంనగర్ జిల్లాలో ఒక్క గుంట కూడా బీడు భూమి లేకుండా సాగుచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అధికారులు వివరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

## తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారు: ఈటల రాజేందర్



సికింద్రాబాద్: ఎందరో పొరుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఈటల మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనను కొనియాడారు. ‘‘నేను ఆరోగ్యమంత్రిగా ఉన్నప్పుడు దేశంలో దీనపరిస్థితి నెలకొని ఉంది. కరోనా వల్ల ప్రపంచమంతా విలవిల్లాడిపోయింది. అమెరికా, చైనాల్లో వచ్చిన పరిస్థితులు భారత్‌లోనూ వస్తాయని భయపెట్టారు. ఎంత మంది భయపెట్టినా ప్రధాని మోదీ భయపడలేదు. దేశంలోనే కొవిడ్ వ్యాక్సిన్ల తయారీని ప్రధాని ప్రోత్సహించారు. దేశ ప్రజలకే కాదు.. విదేశాలకు కూడా వ్యాక్సిన్లు ఇచ్చి భారత్ ఆదుకుంది. మన దేశంలో మేధోశక్తి విదేశాలకు వలస పోవద్దని భావించి ప్రధాని మోదీ మేకిన్ ఇండియా అమలు చేశారు.

# శాంతి స్థాపన జరిగి దశాబ్దం.. బొగోటాలో ఘనంగా యోగా దినోత్సవం

బొగోటా: కొలంబియా రాజధాని బొగోటాలోని ప్రఖ్యాత శాంటా మారియా ప్లాజాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాది మంది యోగా సాధకులు, ఔత్సాహికులు పాల్గొన్న ఈ వేడుకకు ప్రపంచ ప్రఖ్యాత యోగా గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ హాజరయ్యారు. సరిగ్గా ఒక దశాబ్దం కిందట కొలంబియా ప్రభుత్వం, తీవ్రవాద ఫార్క్ గెరిల్లా సంఘాలు శాంతి ఒప్పందం చేసుకోవడంలో గురుదేవ్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దశాబ్దాలపాటు కొనసాగిన తీవ్రవాద సాయుధ సంఘర్షణకు స్వస్తి చెప్పి పదేళ్లు పూర్తైన సందర్భంగా ఈ ఏడాది అక్కడ జరిగిన యోగా వేడుకల్లో పాల్గొనడం విశేషం. ఇది కొలంబియాలో శాంతి దశాబ్దానికి గుర్తుగా నిలిచింది. ఈ సందర్భంగా గురుదేవ్ మాట్లాడుతూ.. యోగాను కేవలం శారీరక వ్యాయామంగా మాత్రమే అనుకోవద్దని.. ఇది మానసిక స్థితిని సైతం మార్చగలదన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ఆదరణ పొందిందన్న ఆయన.. మొట్టమొదటి కామన్ యోగా ప్రోటోకాల్‌ను రూపొందించిన కమిటీకి తాను అధ్యక్షత వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 'ప్రపంచ జనాభాలో మూడొంతులకు పైగా ప్రజలు ఈ ప్రోటోకాల్‌ను అనుసరిస్తుండటం నాకు చాలా ఆనందంగా ఉంది. మానసిక ఆరోగ్య రంగంలో మన పని ఇక్కడితో ఆగదు. నిజానికి ఇది ఆరంభం మాత్రమే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొగోటా కల్చరల్ సెక్రటేరియట్‌కి చెందిన ఆబ్జర్వేటరీ ఆఫ్ కల్చర్ అండ్ కల్చరల్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ.. 'కొన్ని వారాలుగా దేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని ఉంది. ఆ ఉద్రిక్తతలను చల్లార్చి, సమతుల్యం తీసుకురావడానికి, బొగోటా దేశ ప్రజలందరికీ ఒక సానుకూల సందేశాన్ని ఇచ్చేందుకు ఇప్పుడు సరైన సమయం వచ్చింది'' అని వ్యాఖ్యానించారు. 2015లో కొలంబియాలో శాంతిస్థాపన ఇక అసాధ్యమని చాలామంది అనుకున్న సమయంలో దానిని గురుదేవ్ సాధించారు. దాదాపు 50 సంవత్సరాల పాటు ఫార్క్ తిరుగుబాటుదారులు, కొలంబియా ప్రభుత్వం మధ్య జరిగిన ఉద్రిక్తతలు,



ఘర్షణలు కొనసాగాయి. అనేక శాంతి ఒప్పందాలు విఫలమై, అవిశ్వాసపు అగాధం ఇరువర్గాలలో నెలకొన్న తరుణంలో గురుదేవ్ ఫార్క్ కమాండర్లతో మూడు రోజుల పాటు మధ్యవర్తిత్వ చర్చలు నిర్వహించారు. అహింసను ఆయుధంగా స్వీకరించాలని, దేశ భవిష్యత్తు కోసం విస్తృత దృక్పథంతో చర్చలను అంగీకరించాలని వారిని కోరారు. ఆయన చొరవతో సంక్షోభానికి పరిష్కారం లభించింది. ఒక ఏడాది పాటు సంపూర్ణ కాల్పుల విరమణను ఫార్క్ ప్రకటించిన తర్వాత శాంతి ఒప్పందానికి మార్గాన్ని సిద్ధం చేసింది. పదేళ్ల తర్వాత నేడు గురుదేవ్ మళ్లీ కొలంబియాను సందర్శించారు. కేవలం దశాబ్ది ఉత్సవాన్ని జరుపుకోవడానికి మాత్రమే కాకుండా.. మరింత శాంతియుతంగా, ఐక్యతతో కూడిన దక్షిణ అమెరికాను సాధించే దిశగా వారు తమ దృష్టిని సారించారు. బొగోటా, మెడెలిన్, కార్టాజెనా వంటి నగరాల్లో, ఆయన కొలంబియా పార్లమెంట్ సభ్యులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలను కలుసుకుని, వారికి ధ్యానపు లోతైన అనుభూతిని పరిచయం చేశారు. కొలంబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి గురుదేవ్ మాట్లాడుతూ .. 'కష్టాలనుంచి విముక్తి పొందిన ప్రపంచం.. మరింత ప్రేమభరితమైన, ఆనందం, శాంతితో నిండిన ప్రపంచం అనేది ఓ ఊహాగా అనిపించవచ్చు. అది ఒక కలగానే ప్రారంభమవుతుంది. మనం ఈ కలను కనడం ప్రారంభిస్తే.. దాన్ని తప్పక నిజం చేయగలమని నేను నమ్ముతున్నా" అన్నారు. అంతకుముందు జూన్ 20వ తేదీన, సమాజ నిర్మాణంలో గురుదేవ్ చూపిన శ్రద్ధ, నిబద్ధత, స్ఫూర్తిమంతమైన, నిరంతర సేవలకు గుర్తింపుగా కార్టాజెనా డే ఇండియాస్ నగర మేయర్ డుమెక్ టుర్‌బే పాజ్ శ్రీశ్రీ ని బొలీవార్ గవర్నరేట్ మెడల్‌తో సత్కరించారు. ప్రపంచంలో శాంతి, ఆనందాలను ప్రోత్సహించడంలో గురుదేవ్ పాత్రను ప్రశంసించారు. 2016లో దిల్లీలో జరిగిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వరల్డ్ కల్చర్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్రదర్శకురాలు, ఫోటోగ్రాఫర్ లికా గవీష్ తన అనుభవాన్ని పంచుకుంటూ.. 'నా భాగస్వామి ఒక కెమెరామెన్‌గా ఘర్షణ ప్రాంతాల్లో పనిచేశాడు. అక్కడి పరిస్థితులు ఎంత కఠినంగా ఉంటాయో నాకు బాగా తెలుసు. అటువంటి ప్రాంతంలో శాంతిని తీసుకురావడంలో గురుదేవ్ పాత్ర పోషించారన్న విషయం నన్ను బాగా కదిలించింది. ప్రపంచం ఆయనకు ఎంతో రుణపడి ఉంటుంది'' అని ఉద్వేగానికి లోనయ్యారు.




## ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు.. రియాద్‌కు మళ్లింపు


దిల్లీ: జూన్ 21న బర్మింగ్‌హామ్ నుంచి దిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ విమానాన్ని రియాద్‌కు మళ్లించారు. అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయి ప్రయాణికులంతా దిగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విమానంలో భద్రతాపరమైన తనిఖీలు పూర్తయినట్లు ఎయిరిండియా అధికార ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులందరికి అక్కడ వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది. అలాగే, ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

## 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'..
# మావోయిస్టులకు అమిత్ షా హెచ్చరిక

వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. ''ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం.



2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం'' అని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. ''మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి'' అని తెలిపారు. ఇదిలా ఉండగా.. నక్సలిజం సమస్యపై ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఒడిశా ఉన్నతాధికారులతో అమిత్ షా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.



## పహల్గాం ఉగ్రదాడి..
## ముష్కరులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరి అరెస్టు

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైన సంగతి తెలిసిందే. ఈ దాడులకు తెగబడిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. ఈ మేరకు ఎన్ఐఏ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఎన్ఐఏ తెలిపిన వివరాల ప్రకారం.. ''పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి కారణమైన ముగ్గురు ముష్కరులకు ఆశ్రయం కల్పించిన పర్వేజ్, బషీర్‌ను అరెస్టు చేశాం. వారిని ప్రశ్నించగా.. ఉగ్రవాదుల పేర్లను బయటపెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారు పాక్ దేశీయులు. దాడి చేసినవారికి లష్కరే తొయ్యిబాతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. దాడికి ముందు ఉగ్రవాదులని తెలిసే ఆశ్రయం కల్పించారు. వారికి ఆహారం, ఆశ్రయంతో పాటు రవాణా సదుపాయం కూడా కల్పించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతుంది'' అని ఎన్ఐఏ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ ప్రాంతమైన బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ దాడులకు వణికిపోయిన పాక్.. చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత్ సైతం అంగీకరించింది.

## 'లాలూ.. బిహార్ గబ్బర్ సింగ్.. ఆయనంటే ప్రజలకు భయం'

పట్నా: ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌పై బిహార్ డిప్యూటీ సీఎం, భాజపా నేత సామ్రాట్ చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లాలూను బిహార్ గబ్బర్‌సింగ్ (షోలే చిత్రంలో విలన్), అవినీతికి ప్రతీకగా ఆయన అభివర్ణించారు. ఈ ఏడాది చివరలో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అవమానకరమైన రీతిలో ఆయన ఓటమి ఎదుర్కోక తప్పదని జోస్యం చెప్పారు. ''లాలూ ప్రసాద్ యాదవ్ బిహార్ గబ్బర్ సింగ్. రాజకీయాల్లో ఆయన చురుగ్గా ఉన్నంత వరకు ప్రజలు ఆయనకు భయపడుతూనే ఉంటారు. ఆయన అవినీతికి ప్రతీక అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. ఆర్జేడీ నేరస్థులతో నిండిపోయింది. లాలూ కుటుంబం అవినీతిపరులతో నిండిపోయింది''అని సామ్రాట్ ఆరోపించారు. లాలూ ఆయన కుటుంబం బిహార్‌ను లూటీ చేసిందన్న ఆయన.. రాబోయే ఎన్నికల్లో ఆర్జేడీ అవమానకరమై రీతిలో ఓటమి చవిచూస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్ కుమార్ సారథ్యంలో బిహార్ ప్రగతిపథంలో పయనిస్తోందని చెప్పారు. 20252030 మధ్య కాలంలో బిహార్ పారిశ్రామిక హబ్‌గా మారుతుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి



గురించి ప్రశ్నిస్తున్న విపక్షాలు.. పట్నా ఎయిర్‌పోర్టు, గంగా పథ్, పట్నాబక్సర్ రోడ్డు, పట్నా ముజఫర్‌పూర్ రోడ్డు చూడాలన్నారు. ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులనూ ఎన్డీయే ప్రభుత్వం పూర్తి చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# రాహుల్‌కు 'మేకిన్ ఇండియా' అంటే ఏంటో తెలియదు

**: సీఎం ఫడణవీస్**

ముంబయి: 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇండియా'గా మారిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పోస్టుపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ మండిపడ్డారు. రాహుల్‌కు మేకిన్ ఇండియా అంటే ఏమిటో తెలియదన్నారు. అంతేకాకుండా మనదేశంలో ఏం తయారవుతుందో కూడా ఆయనకు తెలియదని ఆక్షేపించారు. ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేదని, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో



దేశాన్ని ఐదో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారని కూడా ఆయనకు తెలియకపోవచ్చని విమర్శించారు. రాబోయే రెండేళ్లలో దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని తెలిపారు. రాహుల్ కొంత హోంవర్క్ చేయాలని హితవు పలికారు. ప్రధాని మోదీ నినాదాలివ్వడంలోనే ఆరితేరారని, దేశ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'మేకిన్ ఇండియా' నినాదంతో మోదీ ఊదరగొడుతున్నా దేశంలో ఉత్పాదకత కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇన్ ఇండియా'గా మారిందని ధ్వజమెత్తారు. దిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 'నెహ్రూ ప్లేస్'లో తాజాగా పర్యటించిన రాహుల్.. అక్కడ పనిచేసే టెక్నీషియన్లతో ముచ్చటించిన వీడియోను ఆయన షేర్ చేసుకున్నారు.

## ఆపరేషన్ సింధు.. ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు షురూ

ఇజ్రాయెల్ ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఈ దేశాల్లోని భారతీయులను స్వదేశానికి తరలించేందుకు ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఇరాన్ నుంచి వెయ్యి మందికిపైగా పౌరులను భారత్‌కు తీసుకొచ్చింది. తాజాగా ఇజ్రాయెల్ నుంచి తరలింపు ప్రక్రియ ప్రారంభించింది. ఈ క్రమంలోనే 160 మందితో



కూడిన తొలి బ్యాచ్ ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్ సరిహద్దుకు చేరుకుంది. ఇజ్రాయెల్‌లో దాదాపు 40 వేలమంది భారతీయులు వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. ఇరాన్ దాడులతో స్థానికంగా పరిస్థితులు దిగజారుతుండటంతో.. అక్కడి భారతీయుల తరలింపునకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు స్థానిక రాయబార కార్యాలయం అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తొలి బ్యాచ్ కింద టెల్అవీవ్, హైఫాల నుంచి 160 మంది భారతీయులను రోడ్డు మార్గంలో జోర్డాన్ సరిహద్దుకు తరలించింది. ఇజ్రాయెల్ గగనతలం మూసిఉండటంతో జోర్డాన్ మీదుగా వారిని స్వదేశానికి తీసుకురానుంది. విదేశాంగశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానాలు జోర్డాన్ రాజధాని అమ్మాన్ నుంచి దిల్లీకి చేరుకోనున్నాయి.

# విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలను అభివృద్ధి చేయడం నా బాధ్యత: మంత్రి

నెల్లూరు(స్టోన్ హౌస్ పేట): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వినూత్నంగా ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం నెల్లూరు వీఆర్ హైస్కూల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలసి మంత్రి నారాయణ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లా డుతూ.. చిన్నతనంలో తనకు విద్యాబుద్ధులు నేర్పించి, ఉన్నత స్థితికి కారణమైన వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను అభివృద్ధి చేయటం కనీస బాధ్యతగా భావించానని తెలిపారు. ఇందుకు తన కుమార్తెలు ముందుకు వచ్చారని, పాఠశాల ఆధునికీకరణలో భాగం పంచుకున్నారని వివరించారు. పేద విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చి వారికి ప్రవేశాలు కల్పించినట్టు చెప్పారు. అడ్మిషన్ల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడిందన్నారు. దాంతో ఒకటి నుంచి 9వ తరగతి వరకు రెండు సెక్షన్లకు బదులు మూడు సెక్షన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యంత పేద విద్యార్థులను గుర్తించి ప్రవేశాలు



కల్పించామన్నారు. ప్రభుత్వం అందించే యూనిఫామ్‌కు అదనంగా నారాయణ విద్యాసంస్థల ద్వారా మరో నాలుగు జతల యూనిఫామ్ అందిస్తామని, పాఠశాలకు దగ్గరగా ఉన్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందిస్తామన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం సైతం కల్పిస్తున్నామన్నారు. నారాయణ విద్యాసంస్థల ద్వారా అవసరమైన ఫ్యాకల్టీ, బుక్స్ అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 విధానంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పారిశ్రామికవేత్త డీఎస్ఆర్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు పాఠశాలలను ఆధునికీకరిస్తామన్నారు.

## పరామర్శ పేరుతో సొంత పార్టీ కార్యకర్తలను బలిపెడుతున్నారు: ప్రత్తిపాటి

గుంటూరు: ప్రజల ప్రాణాలను పట్టించుకోని వైకాపా నైజం ప్రజలు అర్థం చేసుకోవాలని తెదేపా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పరామర్శ పేరుతో సొంత పార్టీ కార్యకర్తలను బలిపెడుతున్నారని మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. అన్నీ వారే చేసి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తారని ధ్వజమెత్తారు. ఐదేళ్ల రాక్షస పాలన నుంచి ప్రజలు రాష్ట్రాన్ని కాపాడారని చెప్పారు. ఎన్డీయే కూటమి ఏడాది పాలన సందర్భంగా



నిర్వహించనున్న 'సుపరిపాలనతొలి అడుగు' సభను వైకాపా నేతలు అసూయ పడేలా విజయవంతం చేయాలని పిలుపుచ్చారు.

## ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం..
## ఆ భూమి అహోబిలం మఠానిదే: వరదరాజన్

నెల్లూరు: నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడులో 295 సర్వే నెంబర్‌లో ఉన్న 1.80 ఎకరాల భూమి అహోబిలం మఠానిదేనని.. ఆ మఠం నెల్లూరు జిల్లా కార్యదర్శి వరదరాజన్ తెలిపారు. దేవుడి భూమి దేవునికే అప్పగించాలని మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా స్పందించలేదని ఆయన మీడియా సమావేశంలో చెప్పారు. 1.80 ఎకరాల భూమికి సంబంధించి తమకు 1869 నుంచి హక్కులు ఉన్నాయని, ఏటా శిస్తు కూడా చెల్లించామన్నారు. 2007లో ఈ భూమి అన్యాక్రాంతమైందని, తాజాగా రెవెన్యూ



అధికారులు విచారించి మఠం భూమిగా తేల్చారన్నారు. ఆలయ భూమి అని తెలిస్తే సామాన్యులు సైతం దేవుడికి అప్పగిస్తారని, అలాంటిది ఎంపీగా, ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించి.. ఉన్నత స్థాయిలో ఉన్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి భూమి తమదేనంటూ మాపైన, అధికారులపైన లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

## వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు

తాడేపల్లి: వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజధాని మహిళలపై సజ్జల.. అనుచిత వ్యాఖ్యలు చేశారని శిరీష ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో 352,353(2), 196(1) సెక్షన్ల కింద సజ్జలపై కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి



కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వం మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది: జగన్

* ఏపీ ప్రభుత్వం మరో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని జగన్ ఆరోపణ
* జూన్ 24న ఏపీఎండీసీ ద్వారా బాండ్ల జారీకి ప్రయత్నాలు చేస్తోందని వెల్లడి
* రాష్ట్ర సంచిత నిధికి ప్రైవేటు వ్యక్తులకు అనుమతిస్తున్నారని విమర్శ
* ఏపీఎండీసీ భవిష్యత్ రాబడులు, ఖనిజ సంపద తాకట్టు పెడుతున్నారన్న జగన్
* హైకోర్టులో కేసు విచారణలో ఉండగా బాండ్ల జారీ అనుచితమని వ్యాఖ్య

ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం మరోసారి భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్



(ఏపీఎండీసీ) ద్వారా జూన్ 24న నిబంధనలకు విరుద్ధంగా, మునుపెన్నడూ లేని విధంగా నాన్‌కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్సీడీ) రూపంలో బాండ్ల జారీకి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన పలు కీలక అంశాలను లేవనెత్తుతూ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకుండా రాష్ట్ర ఖజానా నుంచి నిధుల ఉపసంహరణకు వీలు కల్పిస్తూ, ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ది స్టేట్)ని అందుబాటులోకి తెస్తున్నారని జగన్ ఆరోపించారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర సంచిత నిధిని హామీగా చూపి ఏపీఎండీసీ రుణాలు సేకరించడానికి అనుమతించడం ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఏపీఎండీసీకి భవిష్యత్తులో వచ్చే ఆదాయం మొత్తంపైనా బాండ్ హోల్డర్లకు ప్రత్యేక హక్కు కల్పించారని, దీనికి అదనంగా సుమారు రూ.1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఖనిజ సంపదను కూడా ఎన్సీడీ బాండ్ హోల్డర్లకు తాకట్టు పెడుతున్నారని జగన్ ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, దీనిని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ప్రతివాదులందరికీ కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు కూడా జారీ చేసిందని జగన్ గుర్తు చేశారు. విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పుడు, ప్రభుత్వం ఏపీఎండీసీని బాండ్ల జారీకి అనుమతించడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. "రాష్ట్ర భవిష్యత్తును, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం వ్యవహరించడం తీవ్ర విచారకరం" అంటూ వైసీపీ అధినేత జగన్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు పోటెత్తిన వరద



మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి వరద పోటెత్తుతోంది. పైనుంచి వస్తున్న వరద నీటితో జూరాల డ్యామ్ ఇప్పటికే నిండుకుండలా మారింది. ఈ సీజన్ లో రెండోసారి అధికారులు డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుకుంటోంది. శ్రీశైలం డ్యామ్ నెమ్మదిగా నిండుకుంటోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి 60,587 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని అధికారులు చెప్పారు. అయితే, డ్యామ్ నుంచి ప్రస్తుతానికి నీటిని వదలడంలేదని తెలిపారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 854.20 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215.7080 టీఎంసీలు, ప్రస్తుతం 89.7132 టీఎంసీలకు చేరిందని అధికారులు వివరించారు. ప్రస్తుతం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామని చెప్పారు.

## తన రియల్ లైఫ్ క్యారెక్టర్ తో సినిమా..
## పవన్ కల్యాణ్ ఏమన్నారంటే...!

ప్రముఖ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సినీ, రాజకీయ ప్రస్థానంపై పలు ఆసక్తికర విషయాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తాను ఇప్పటివరకు పోషించిన పాత్రల్లో ఏ ఒక్కటీ తనకు పూర్తిస్థాయిలో సంతృప్తినివ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఇప్పటిదాకా నేను చేసిన ఏ పాత్ర కూడా నా మనసుకు పూర్తిగా దగ్గరవ్వలేదు. ప్రతి పాత్రలోనూ కొన్ని అంశాలు మాత్రమే నాకు నచ్చాయి. నిజ జీవితంలో నేను ఎలా ఉంటానో, తెరపైనా అలాగే కనిపించాలని నా కోరిక. కానీ, సినిమాల్లో అది కుదరకపోవచ్చు. అలాంటి సినిమాకు జనాదరణ లభించదేమో!" అని అన్నారు. భారతీయ సినిమా రంగం గురించి మాట్లాడుతూ, ఒకప్పుడు బాలీవుడ్‌లో దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే మంచి చిత్రాలు వచ్చేవని గుర్తుచేశారు. "ప్రస్తుతం 'దంగల్' వంటి ప్రభావవంతమైన



సినిమాలు రావడం లేదు. ప్రేక్షకుల అభిరుచులకు తగిన కథలను అందించడంలో వారు వెనుకబడుతున్నారేమో!" అని అభిప్రాయపడ్డారు. నటన నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించడం గురించి పవన్ వివరిస్తూ, తన తండ్రి తనకు స్ఫూర్తి అని తెలిపారు. "నేను నటుడిని కావాలని గానీ, సినిమాల్లోకి రావాలని గానీ ఎప్పుడూ అనుకోలేదు. మాది ఒక మధ్యతరగతి కుటుంబం. మా నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి, ఆయనకు కమ్యూనిస్టు భావజాలం ఉండేది. ఆయన ప్రభావం వల్లే మా కుటుంబ సభ్యులందరికీ రాజకీయాలపై కొంత అవగాహన ఏర్పడింది. నేను అనుకోకుండానే సినిమాల్లోకి అడుగుపెట్టినా, నా దృష్టి ఎప్పుడూ సమాజంపైనే ఉండేది.

## జగన్ వాహనం కింద పడి
## సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకం: షర్మిల

* జగన్ కాన్వాయ్ లో ప్రమాదం
* జగన్ వాహనం కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి
* ప్రశ్నల వర్షం కురిపించిన షర్మిల
* కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న స్పృహ లేకుండా కాన్వాయ్ కొనసాగడం ఏంటి అంటూ ఫైర్

వైసీపీ అధ్యక్షుడు జగన్ వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకం అంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. ఒళ్ళు గగుర్పొడిచేలా ఉంది ఈ ఘటన అంటూ సోషల్ మీడియాలో స్పందించారు. ఈ మేరకు జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న సోయి లేకుండా కాన్వాయ్ కొనసాగడం ఏంటి ? 100 మందికి పర్మిషన్ ఇస్తే వేల మంది ముందు సైడ్ బోర్డు మీద నిలబడి జగన్ చేతులూపడం ఏంటి? అంటూ మండిపడ్డారు. "ప్రజల ప్రాణాలు తీసే హక్కు మీకు ఎవరిచ్చారు ? బెట్టింగ్ లో ఓడిపోయి సూసైడ్ చేసుకున్న వ్యక్తి విగ్రహ ఆవిష్కరణకు ఇద్దరిని బలి ఇస్తారా ? ఇదేం రాజకీయం ? ఇదెక్కడి రాక్షస ఆనందం ? మీ ఉనికి కోసం జనాలను టైర్ల కింద తొక్కుకుంటూ పోతారా ? ప్రజల ప్రాణాల మీద శవ రాజకీయాలు చేస్తారా ? కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా ? ఇది పూర్తిగా జగన్ గారి బాధ్యత రాహిత్యానికి అద్దం పడుతుంది. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్, 100 మందికి అనుమతి ఇచ్చి వేల మందితో వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. పర్మిషన్ కి విరుద్ధంగా జన సమీకరణ జరుగుతుంటే పోలీసులు ఎలా సహకరించారు? ఎందుకు



ప్రేక్షక పాత్ర వహించారు? ఎందుకు ఇంటలిజెన్స్ వ్యవస్థను నిద్ర పుచ్చారు? ప్రజా సమస్యలపై పోరాడితే ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? కాంగ్రెస్ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌజ్ అరెస్ట్ లు చేస్తారు. దీక్షలను భగ్నం చేస్తారు. ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు జగన్ ఏం సమాధానం ఇస్తారు ? చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల కూటమి ప్రభుత్వం దీనికి ఏం సమాధానం చెబుతుంది? దీనిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?" అంటూ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు జగన్ కాన్వాయ్ వీడియో కూడా పంచుకున్నారు.

# స్పోర్ట్స్ దుస్తులకీ బాంధనీ..!



స్పోర్ట్స్, ఫిట్‌నెస్ దుస్తులకు ఉన్న ప్రాముఖ్యత ఎంత చెప్పుకొన్నా తక్కువే. పార్టీవేర్ తర్వాత మనదేశంలో అత్యధికంగా అమ్ముడుపోతున్న దుస్తులివే. ఈ డిమాండ్‌కు తగినట్లుగానే రోజుకో కొత్త ట్రెండ్... కొత్త బ్రాండ్. ఇప్పటితరం కూడా తగ్గేదే లేదు అంటూ ప్రతి అప్‌డేట్‌నూ అందిపుచ్చుకుంటోంది. అమ్మాయిలైతే... స్పోర్ట్స్ దుస్తుల ఎంపికలో సౌకర్యం తరవాత అందానికే ఓటు వేస్తున్నారు. ఈ క్రమంలో ఎన్ని ట్రెండ్‌లు వచ్చినా రంగుల ప్రాధాన్యత విషయంలో మాత్రం ఏ తేడా లేదు. ఇప్పటిదాకా అదే నలుపు, గోధుమ, బూడిద లాంటి రంగుల్లోనే స్పోర్ట్స్‌వేర్‌ను చూస్తున్నాం. మహా అయితే పింక్, పీచ్, గ్రీన్ లాంటివీ వచ్చాయి. అన్నీ పై నుంచి కింద దాకా ఒకే రంగు. వీటన్నింటికీ చెక్ చెప్పేస్తూ... కొత్త తరహా ఫ్యాషన్‌ను ఆహ్వానించింది స్పోర్ట్స్ ఉపకరణాల తయారీ దిగ్గజ సంస్థ నైక్. అదేంటంటే... టై అండ్ డై. దీన్ని మెచ్చని అమ్మాయిలు లేరంటే అతిశయోక్తి కాదేమో. ఒత్తిడికి మంత్రంలానూ టై అండ్ డైని ఉపయోగించుకుంటున్నారు. పాతవాటికి కొత్తరూపు తేవాలన్నా ఈ కళనే ఆశ్రయిస్తున్నారు. మగువల మనసు దోచిన ఈ కళను... 'నార్‌బ్లాక్ నార్‌వైట్' డిజైనర్లతో కలిసి స్పోర్ట్స్ దుస్తులకీ అన్వయిస్తోంది నైక్. గుజరాత్, రాజస్థానీ నేత కళైన బాంధనీ ప్రింట్స్‌ను ఇందుకు ఎంచుకుంది. ఆ తరహాలో స్పోర్ట్స్ దుస్తులకి రంగులు అద్దింది. అన్ని ఆటలకీ సరిపడా దుస్తుల్ని ఈ స్టైల్‌లో డిజైన్ చేశారు డిజైనర్లు. క్రికెట్ నుంచీ రెజ్లింగ్ దాకా ప్రతిదీ ఈ తరహాలోనే తీసుకువచ్చారు. బ్యాగులు, షూ లాంటి వాటినీ 'టై అండ్ డై' ద్వారా తెచ్చే ప్రయత్నంలో ఉన్నారట. మీకు నచ్చాయా? ప్రయత్నించేయండి మరి!











# క్యారట్‌తో మెరిసే చర్మం..!



**క్యారట్.. ఆరోగ్యానికే కాదు.. సౌందర్య సంరక్షణలోనూ ఎంతగానో ఉపకరిస్తుంది. వీటితో వార్ధక్యాన్ని నివారించే, చర్మాన్ని ప్రకాశవంతంగా మార్చే రకరకాల ఫేస్‌ప్యాక్స్, మాస్క్స్ కూడా చేసుకోవచ్చు. ఇన్ని మంచి సుగుణాలు క్యారట్ సొంతం కాబట్టే చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. పైగా ఇంట్లో సులభంగా లభించేదే కాబట్టి అందుబాటు బడ్జెట్‌లోనే కాంతులీనే చర్మాన్ని సొంతం చేసుకోవచ్చు.**



### మేకప్‌కి ముందు!

మనం వేసుకునే మేకప్ ఎక్కువ సమయం నిలిచి ఉండాలంటే చర్మంలో తేమ శాతం బాగుండాలి. అందుకే మేకప్ వేసుకోవడానికి ముందు అరటేబుల్ స్పూన్ క్యారట్ జ్యూస్‌కి, అరటేబుల్ స్పూన్ కమలారసం జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో ముఖానికి 10 నిమిషాల పాటు మృదువుగా మర్దన చేయాలి. తర్వాత నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేసిన తర్వాత మేకప్ వేసుకుంటే ఆ ప్రభావం ఎక్కువసేపు కనిపిస్తుంది.

### పిగ్మెంటేషన్ సమస్యకూ..

మీరు పిగ్మెంటేషన్ సమస్యతో సతమతమవుతున్నారా? అయితే ఈ ప్యాక్ ప్రయత్నించి చూడండి..

### కావాల్సినవి:

* క్యారట్ జ్యూస్ 2 టేబుల్‌స్పూన్స్
* ఓట్స్ పౌడర్ 1 టేబుల్‌స్పూన్
* పసుపు తగినంత
* చక్కెర 1 టేబుల్‌స్పూన్

### తయారీ:

ముందుగా క్యారట్‌ని తరిగి గ్రైండ్ చేసి జ్యూస్ సిద్ధం చేసుకోవాలి. ఇప్పుడు ఆ జ్యూస్‌కి ఓట్స్ పౌడర్‌ని జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం మెత్తని పేస్ట్‌లా అయ్యాక దానికి కాస్త పసుపు, పంచదార జత చేయండి. బాగా మిక్స్ చేశాక ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని మృదువుగా మర్దన చేయాలి. 20 నిమిషాల తర్వాత నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. పసుపు మేని ఛాయని మెరుగుపరిస్తే, క్యారట్ జ్యూస్ చర్మం కాంతులీనడానికి సహాయపడుతుంది. పంచదార, ఓట్స్ పౌడర్ స్క్రబ్‌లా పనిచేస్తాయి.



ఒకప్పుడు చందమామను చూపిస్తూ.. గోరుముద్దలు తినిపించేది అమ్మ! పిల్లాడు ఆరోగ్యంగా పెరిగేవాడు. ఇప్పుడు.. సెల్‌ఫోన్ చేతికిచ్చి, ముద్దలు తినిపిస్తుంది. నాన్నేమో.. ట్యాబ్ చూపిస్తూ లాల పోస్తున్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదుగుతున్న చిన్నారులను.. పసితనంలోనే అనేక రుగ్మతలు చుట్టుముడుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత కొన్నిరకాల వ్యాధులకు కారణం అవుతున్నది. అందులో ఒకటి ఆటిజం. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌ల వాడకం పెరిగేకొద్దీ ఆటిజం సమస్య హెచ్చుతున్నది.

# ఎండల్లో తప్పు చేయకండి!

ఎండాకాలం వచ్చిందంటే చర్మానికీ, శరీరానికీ అవసరాలు మారతాయి. దానికి తగ్గట్టు కొన్ని విషయాల్లో మనమూ మారతాం. అక్కడే తప్పు చేసే అవకాశం ఉంది. ఇవి అవసరాలు కాదు, అనర్థాలు అంటున్నారు చర్మ, ఆరోగ్య నిపుణులు.

**ఇంట్లో అక్కర్లేదు**

సన్‌స్క్రీన్ బయటికెళ్లేప్పుడు మాత్రమే రాసుకోవాలి. ఇంట్లో ఉన్నా, కారులో వెళ్తున్నా అక్కర్లేదు అనుకోవడం అపోహ మాత్రమే. మనం ఎక్కడ ఉన్నా మన చుట్టూ ఉండే వెలుతురులో చర్మానికి హాని చేసే అతినీల లోహిత కిరణాలు ఉంటాయి. కాబట్టి తప్పకుండా ఈ సమయంలో సన్‌స్క్రీన్ వాడాలి.

**కడుగుతూనే ఉండాలి**


ఎండాకాలం వచ్చిందంటే అదేదో యాడ్‌లో 'కడుగు బాబు కడుగు' అన్నట్టు మొహాన్ని మాటిమాటికీ నీళ్లతో కడుగుతుంటారు. ఇది ఎండవేళ చర్మానికి హాయిని కలిగించి, తేమగా ఉంచుతుందని అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. ఇలా మాటిమాటికీ నీటితో చర్మాన్ని కడగడం వల్ల 'ట్రాన్స్ ఎపిడెర్మల్ వాటర్ లాస్ (టీఈడబ్ల్యూఎల్)' అని పిలిచే ప్రత్యేక పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో చర్మం తేమను కోల్పోయి పొడిబారుతుంది.

**అదైతే చాలు**

వేసవిలో ఏ వీధి మూలన చూసినా మజ్జిగ, పుదీనా రసం కుండలు, జీరా నీళ్లు, నిమ్మరసాలు దొరుకుతుంటాయి. ఎండవేళ చలువ చేస్తాయన్న ఉద్దేశంతో వాటిని స్వేచ్ఛగా తాగుతుంటారు. కానీ, ఇలా బయట దొరికేవి తాగేప్పుడు అక్కడ ఎంత పరిశుభ్రత పాటిస్తున్నారు, ఎలాంటి నీళ్లు వాడుతున్నారులాంటివి గమనించాలి. లేకపోతే పొట్టకు లేనిపోని తంటా తెచ్చినట్టే.

**అన్నీ తాగొచ్చు**

ఎండవేళ శరీరంలో నీటి స్థాయుల్ని నిలిపి ఉంచేందుకు ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కాబట్టి మంచీ చెడులతో సంబంధం లేకుండా ఏమైనా తాగొచ్చు అనుకోవడం పొరపాటు. కేవలం మజ్జిగ, కొబ్బరినీళ్ల లాంటి సంప్రదాయ ఆరోగ్యకర పానీయాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. మిల్క్‌షేక్‌లు, శీతల పానీయాల్లాంటి హై క్యాలరీ డ్రింకులను ఏ కాలంలో అయినా పక్కన పెట్టేయాల్సిందే.



# ఆటిజం.. అరువు తెచ్చుకుంటున్నాం!

**మన దేశంలో ప్రతి 80మంది చిన్నారుల్లో ఒకరికి ఆటిజం సమస్య ఉండవచ్చనేది ఒక అంచనా. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఆటిజంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా ఏప్రిల్ 2న 'వరల్డ్ ఆటిజం అవేర్‌నెస్ డే' నిర్వహిస్తున్నది. అసలు ఈ ఆటిజం అంటే ఏంటి, అది ఎందుకు వస్తుంది, రావడానికి గల కారణాలేంటి? దాని లక్షణాలు, ఆటిజం వల్ల పిల్లల్లో ఎలాంటి అనారోగ్యం ఏర్పడుతుంది? ఈ సమస్యను ఎలా గుర్తించాలి, నిర్ధారణ పద్ధతులు, చికిత్సా విధానం తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

**ఆటిజం** అనేది బయటికి కనిపించే ఒక రకమైన మానసిక వ్యాధి లక్షణం. చాలా ఆటిజం కేసుల్లో మాటలు మొదట్లో వస్తాయి. కానీ రెండేండ్లు వచ్చేసరికి మాటలు ఆగిపోతాయి. దీనినే 'రిగ్రెషన్' అంటారు. చాలామంది పిల్లల్లో మొదటి రెండేండ్లలోపే ఇది జరుగుతుంది. ఆటిజం సమస్య ఉన్న చిన్నారుల్లో నాలుగైదు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి.

1. భావ వ్యక్తీకరణ లేకపోవడం. అది భాష పరంగా గానీ, హావభావాలు వ్యక్తపరచడంలో గానీ సమస్య ఉంటుంది. అంటే వాళ్లు సరిగ్గా మాట్లాడలేరు.
2. ఇతరుల భావాలను గ్రహించలేరు. అంతేకాదు వారి భావోద్వేగాలను వ్యక్తపర్చలేరు.
3. సామాజిక బాంధవ్యాలు తెలియదు. అంటే ఇతరులతో కలిసి ఆడుకోవడం, కలివిడిగా ఉండటానికి ఇష్టపడరు. ఒంటరిగా ఉండాలని కోరుకుంటారు.
4. చేసిన పనినే మళ్లీ మళ్లీ చేస్తుంటారు.
5. ఈ చిన్నారుల్లో మానసిక పరిణతి తక్కువగా ఉంటుంది.

ఈ లక్షణాలన్నీ ఆటిజం పిల్లల్లో ప్రాథమికంగా కనిపిస్తుంటాయి. ఈ సమస్యలతో సతమతమవుతున్న వారిని ఆటిజం బాధితులుగా పరిగణిస్తారు.



**కారణాలు**

- ఆటిజం సమస్యకు ఒక ప్రత్యేకమైన కారణమని ఏదీ లేదు. సాధారణంగా 9 నెలల నుంచి 18 నెలలు వచ్చే వరకు పిల్లలు భావాలను వ్యక్తీకరించడంతో పాటు, గ్రహించడం, భాష నేర్చుకోవడం చేయగలుగుతారు. ఈ వయసులో చిన్నారులకు ఫోన్‌లు, టీవీ, ట్యాబ్ లాంటివి అలవాటు కావడం వల్ల భావ వ్యక్తీకరణ, భాష నేర్చుకోవడం దెబ్బతింటుంది. స్క్రీన్ టైమ్‌కి అలవాటు పడితే ఈ సమస్యలు వస్తాయి. అమెరికన్ పీడియాట్రిక్ సొసైటీ ప్రకారం మొదటి 3 సంవత్సరాల వరకు పిల్లలను ఫోన్, టీవీకి దూరంగా ఉంచడం మంచిది. వాటికి అలవాటుపడితే ఆటిజం వచ్చే ప్రమాదం ఉందని సదరు సొసైటీ హెచ్చరించింది.
- బహుళ భాషలను నేర్చుకోవాల్సి రావడమూ పిల్లల్లో ఆటిజం సమస్యకు కారణం కావొచ్చు. చిన్నారులకు మాటలు వచ్చే క్రమంలో.. తల్లిదండ్రులు వేర్వేరు భాషల్లో మాట్లాడటం వల్ల, పిల్లలకు ఏ భాషను స్వీకరించాలో అర్థం కాదు. వాళ్లు అయోమయానికి గురై భాషపై పట్టుచిక్కకపోవడం వల్ల ఆటిజానికి గురయ్యే అవకాశాలు ఉంటాయి.
- యాంటీ బయోటిక్స్ లాంటి ఔషధాలు ఎక్కువగా వాడటం కూడా ఆటిజానికి దారి తీయొచ్చు.
- ఐవీఎఫ్ ద్వారా జన్మించిన పిల్లల్లో కూడా ఆటిజం రిస్క్ కనిపిస్తున్నది.
- 18 నెలల వయసులో పిల్లలకు ఇచ్చే ఎంఎంఆర్ టీకా వల్ల కూడా ఆటిజం వస్తుందనేది ప్రజల్లో ఉన్న ఒక అపోహ మాత్రమే. దానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు లేవు.

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లల పెంపకంలో పెద్దల పాత్ర అధికంగా ఉండేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, మేనమామ, అత్తయ్య, చిన్నాన్న, పిన్ని... ఇలా ఎవరో ఒకరు పిల్లలతో సమయం గడిపేవారు. అప్పట్లో సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌ల ఊసే లేదు. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండేది. నిరంతరం వారి మధ్య ఉండటం వల్ల పిల్లల్లో భాషా వికాసం బాగా ఉండేది. హావభావాల వ్యక్తీకరణతో పాటు మానసిక పురోగతిలోనూ వయసుకు తగ్గ పరిణతి కనిపించేది. కానీ, ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల ఉనికి గణనీయంగా తగ్గిపోయింది. నూటికి 90 శాతం న్యూక్లియర్ ఫ్యామిలీలే ఉంటున్నాయి. దీనికితోడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం వల్ల పిల్లలు అధిక సమయం ఒంటరిగా గడపాల్సి వస్తున్నది. మనుషులతో కన్నా డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైంది. ఏడాది వయసున్న పిల్లలు కూడా సెల్‌ఫోన్, ట్యాబ్‌తో ఆడుకోవడం కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితులు సైతం ఆటిజానికి దారితీసే అవకాశాలు లేకపోలేదు.

**రోగ నిర్ధారణ పద్ధతులు**

**ప్రత్యేక** లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలి. ఆటిజాన్ని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి వైద్య పరిజ్ఞానం గానీ, రోగ నిర్ధారణ పద్ధతులు గానీ అందుబాటులో లేవు. కేవలం అనుభవజ్ఞులైన సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు మాత్రమే సమస్యను కొన్ని రకాల పరీక్షల ద్వారా నిర్ధారించగలరు.

**లక్షణాలు**

- పిల్లలు తల్లిదండ్రుల కండ్లలోకి కూడా నేరుగా చూడలేకపోవడం
- పేరుపెట్టి పిలిచినా వెంటనే స్పందించకపోవడం
- ఇతర పిల్లలతో కలిసి ఆడుకోకపోవడం
- ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడటం
- ఒకే రకమైన బొమ్మతో మాత్రమే ఆడుకోవడం, మరో బొమ్మ ఇస్తే తీసుకోకపోవడం
- కొందరు పిల్లల్లోనైతే స్పర్శ, వాసన, చూపు, వినికిడి వంటి జ్ఞానేంద్రియ వ్యవస్థ అసంబంద్ధంగా ఉంటుంది.


ఈ లక్షణాలన్నీ మొదటి మూడు సంవత్సరాల్లోపు కనిపిస్తాయి.

**చికిత్సా పద్ధతులు**

ఆటిజానికి సంబంధించిన లక్షణాలను ఎంత త్వరగా గుర్తించి, సరైన థెరపీలను అందించగలిగితే అంత మంచిది. 6 నెలల్లోనే 50 శాతం సమస్యను నివారించవచ్చు. కనీసం 3 సంవత్సరాల్లోపు సమస్యను గుర్తించి చికిత్స అందిస్తేనే ఫలితం ఉంటుంది. ఈ 3 సంవత్సరాల గోల్డెన్ టైమ్ దాటిపోతే ఎలాంటి చికిత్సలు అందించినా ఫలితం ఆశించిన మేరకు ఉండకపోవచ్చు. ఆటిజం బాధిత చిన్నారులకు ప్రధానంగా మూడు రకాల థెరపీలతో చికిత్స అందిస్తారు. అందులో 1.ఆక్యుపేషనల్ థెరపీ 2. బిహేవియర్ థెరపీ 3. స్పీచ్ థెరపీ

**1.ఆక్యుపేషనల్ థెరపీ:**

పిల్లల్లో ప్రారంభ దశలో జ్ఞానేంద్రియాలు అసంబద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే, ఆక్యుపేషనల్ థెరపీ అందించవచ్చు. దీని వల్ల ఐదు జ్ఞానేంద్రియాలు నియంత్రణలోకి వచ్చి, సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది.



**2.బిహేవియర్ థెరపీ:**

బిహేవియర్ థెరపీతో పిల్లల అసాధారణ ప్రవర్తనకు సంబంధించిన సమస్యలు పరిష్కరించవచ్చు.

**3. స్పీచ్ థెరపీ:**

ఆటిజం పిల్లల విషయంలో స్పీచ్ థెరపీ చాలా ముఖ్యమైంది. మొదటి రెండు థెరపీలు... అంటే ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీల తర్వాతే స్పీచ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే ఇది ప్రభావవంతంగా పనిచేస్తుంది.

**సలహాలు**

- ప్రారంభ దశలోనే గుర్తించి నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- మూడేండ్లలోపు పిల్లలను బ్లూ లైట్‌కు దూరంగా ఉంచాలి. అంటే సెల్‌ఫోన్స్, ట్యాబ్స్, టీవీలు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు ఇవ్వకూడదు.
- పిల్లలకు ఎలక్ట్రానిక్ పరికరాలు ఇచ్చి, ఒంటరిగా వదిలేయకుండా వారితో తల్లిదండ్రులు లేదా ఇతర కుటుంబ సభ్యులు గడపడం ఉత్తమం.





# నిద్రలోనూ సుఖం లేదు!

**శారీరక** శ్రమకు, మానసిక ఆందోళనకు చక్కని ఔషధం నిద్ర. ఆరు గంటలు ఆదమరచి నిద్దరోతే.. సమస్యలన్నీ పరారైన అనుభూతి కలుగుతుంది. కానీ, సుఖమెరుగని నిద్ర.. అతివలకు అంతగా అందడం లేదని సర్వేల సారాంశం. స్లీప్ ఫౌండేషన్ ఇచ్చిన నివేదిక.. పురుషుల కన్నా స్త్రీలు నిద్రలేమితో ఎక్కువగా బాధపడుతున్నారని తేల్చింది. ఉద్యోగం, ఇల్లు, పిల్లలు, ఇతర బాధ్యతలతో మల్టీ టాస్కింగ్ చేస్తున్న మహిళలు సరైన నిద్ర లేక సతమతమవుతున్నారని నివేదిక సారాంశం. ఇందుకు కారణాలూ లేకపోలేదు. రుతుక్రమంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్లలో హెచ్చుతగ్గులు నిద్రకు భంగం కలిగిస్తాయి. ముఖ్యంగా రుతుస్రావం ముందు, మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, రాత్రి చెమటలు నిద్రను భంగపరుస్తున్నాయని పరిశోధకులు తేల్చారు. అంతే కాదు గర్భిణిగా ఉన్నప్పుడు హార్మోన్లలో చోటుచేసుకునే మార్పుల కారణంగా శారీరక అసౌకర్యం ఏర్పడుతుంది. ఇది నిద్ర నాణ్యతపై గణనీయంగా ప్రభావం చూపుతుందట. ఈ నిద్రలేమి హృదయ సంబంధ వ్యాధులు, మానసిక రుగ్మతలకు దారి తీస్తుందని ఆరోగ్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సుఖనిద్రకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవడం అవసరమని సూచిస్తున్నారు.

# స్నానం తర్వాత బ్రషింగా?

**ఒక్కోసారి** హడావుడిగా, ఏదో ఆలోచనలో ఉండి బ్రష్ చేసుకోలేదనే విషయం మరిచిపోయి స్నానం చేసేస్తుంటాం. తర్వాత గుర్తొచ్చి అప్పుడు బ్రష్ చేసుకుంటాం. ఇది ఎప్పుడో పొరపాటున ఒకసారి జరిగితే పర్వాలేదు. కానీ, అదే అలవాటుగా మారితే మాత్రం చర్మానికి నష్టమేనని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. మనం పళ్లు తోముకున్నప్పుడు బ్యాక్టీరియా నోటి నుంచి చర్మం మీదకు చేరే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నోటి చుట్టూ, గడ్డం చుట్టూ ఇరిటేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. తర్వాత అది నెమ్మదిగా మొటిమలకు కారణమవుతుంది. బ్రష్ చేసే సమయంలో చర్మం మీదికి బదిలీ అయిన బ్యాక్టీరియా వల్ల చర్మం మీద పగుళ్లు కూడా ఏర్పడవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందుకే స్నానానికి ముందే బ్రష్ చేసుకోవడం సురక్షితం. ఒకవేళ స్నానం తర్వాత బ్రష్ చేయాల్సి వస్తే ముఖాన్ని మరోసారి సబ్బుతో లేదా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు.



# ముందే తినేయాలి!


**రోజూ వీలైనంత త్వరగా భోజనంచేస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గుతుందట. నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం కోసం పరిశోధకులు 1,03,389 మంది నుంచి ఆహార విధానాలు, గుండె రక్తనాళాల జబ్బులకు సంబంధించిన సమాచారం సేకరించారు. వీరిలో 79 శాతం మంది మహిళలే. పరిశోధనలో పాల్గొన్నవాళ్ల సగటు వయసు 42 ఏండ్లు..**

**వయసు,** లింగం, కుటుంబ పరిస్థితి మొదలైన సామాజిక పరిస్థితులు, ఆహారంలో పోషకాల నాణ్యత, జీవనశైలి, నిద్రా చక్రాన్ని పరిశోధకులు పరిగణనలోకి తీసుకున్నారు. పొద్దున్నే టిఫిన్ చేయకుండా భోజనం చేసేవారిలో ఒక్కో గంట ఆలస్యానికి గుండె రక్తనాళాల వ్యాధుల తీవ్రత 6 శాతం పెరుగుతుందని పరిశోధకులు కనుక్కొన్నారు. అంటే పొద్దునే 9 గంటలకు తినే వ్యక్తికి 8 గంటలకే తిన్న వ్యక్తితో పోలిస్తే గుండె రక్తనాళాల జబ్బుల ముప్పు 6 శాతం ఎక్కువగా ఉంటుందన్న మాట. 9 తర్వాత ఒక్కో గంట గడుస్తుంటే ఈ ముప్పు 28 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించింది. అయితే, ముందురోజు రాత్రి చివరి భోజనానికి, తర్వాతి రోజు ఉదయం భోజనానికి మధ్య విరామం ఎక్కువగా ఉంటే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తక్కువట. అలా ఈ పరిశోధన రోజూ పొద్దున, సాయంత్రం భోజనాలు వీలైనంత త్వరగా ముగించేయాలని వెల్లడిస్తున్నది. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం ప్రపంచ ప్రజల్లో మరణాలకు కారణమయ్యే వ్యాధుల్లో గుండె రక్తనాళాల సమస్యలే ముందువరుసలో ఉన్నాయి.



2019లో గుండె సమస్యలతో 18.6 మిలియన్ల మంది మరణించారు. వీటిలో 7.9 శాతం మరణాలకు ఆహారపు అలవాట్లే ప్రధాన కారణంగా నిలిచాయి. అంటే... ''ఈ తరహా వ్యాధుల పుట్టుక, అభివృద్ధిలో ఆహారం కీలకపాత్ర పోషిస్తున్నదని తెలుస్తుంది. పశ్చిమ దేశాల సమాజాల ఆధునిక జీవనశైలి రాత్రి భోజనం మరీ ఆలస్యంగా చేయడం, పొద్దునే టిఫిన్ తీసుకోకపోవడం మొదలైన ఆహారపు అలవాట్లకు దారితీసింది. అయితే, ఉదయం, రాత్రి భోజనాలు వీలైనంత తొందరగా ముగించుకునే అలవాట్లను స్వీకరిస్తే గుండె రక్తనాళాల వ్యాధుల ముప్పు తగ్గించుకోవచ్చు'' అని పరిశోధకులు పేర్కొన్నారు.

# గ్లైఫోసేట్.. గర్భిణులకు ముప్పు



**గ్లైఫోసేట్‌ను** పంటల్లో కలుపు నివారణకు వాడతారు. ఇది పంటలకు హాని కలిగించకుండానే కలుపును నిర్మూలిస్తుంది. కాబట్టి, రైతులు దీన్ని విస్తృతంగా వాడుతున్నారు. ఏండ్ల తరబడి జరిగిన అధ్యయనాల ద్వారా గ్లైఫోసేట్ మనుషుల్లో క్యాన్సర్‌కు కారణం కావచ్చని భావిస్తున్నారు. ఆహారం రూపంలో అంతగా హాని కలిగించనప్పటికీ గ్లైఫోసేట్ ఆధారిత రసాయనాలు మనుషులను వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. చర్మం మండుతుంది. శ్వాసిస్తే ముక్కు రంధ్రాల్లో ఇబ్బందిగా ఉంటుంది. కొన్నిసార్లయితే తీవ్రతను బట్టి కాలేయం, కిడ్నీల పనితీరును దెబ్బతీస్తుంది. మరణం కూడా సంభవించవచ్చు. అంతేకాదు... గ్లైఫోసేట్ గర్భిణుల మీద మరింత దుష్ప్రభావం చూపుతుంది. గర్భధారణ సమయం ఏ కొంచెం తగ్గినా కూడా పుట్టబోయే శిశువు జీవితంపై ప్రతికూల ప్రభావాలకు దారితీస్తుంది. పైగా బిడ్డ పుట్టకముందే శాశ్వత నష్టం కూడా జరగవచ్చు. బిడ్డ పుట్టిన తర్వాత కూడా శరీర పెరుగుదలకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయి. గర్భిణులపై గ్లైఫోసేట్ ప్రభావం గురించి అమెరికాకు చెందిన 'ది ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ యూనిట్' జరిపిన సర్వేలో ఈ వివరాలు తెలిశాయి.

అధ్యయనం కోసం పరిశోధకులు 18– 40 సంవత్సరాల మధ్య వయసున్న 77 మంది మహిళల్ని ఎంచుకున్నారు. వీరిని 2015 జూన్ నుంచి 2016 జూన్ వరకు పరీక్షించారు. వీరి మూత్రం నమూనాల్లో దాదాపు 93 శాతం మందిలో గ్లైఫోసేట్ అవశేషాలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నట్టు గుర్తించారు. పట్టణ మహిళలతో పోలిస్తే గ్రామీణుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. మొదట్లో దీనికి కారణం నీళ్లు కావచ్చని అనుకున్నారు. కానీ కలుపు నివారణకు గ్లైఫోసేట్ వాడటం వల్ల ఆయా పంటలను ఆహారంగా తీసుకోవడంతో ఈ దుస్థితి దాపురించిందని ఇప్పుడు అనుమానిస్తున్నారు. ఇది చిన్న అధ్యయనమే అయినప్పటికీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలనేది పరిశోధకుల హెచ్చరిక. మరో విషయం... గర్భిణులు తమ తొలి మూడు నెలల కాలంలో ఈ కలుపు నివారిణికి దూరంగా ఉండాలంటున్నారు పరిశోధకులు. లేదంటే తల్లిపాల ద్వారా కలుపుమందు అవశేషాలు పిల్లలకు చేరుకుంటాయి. కాబట్టి, రైతులు కూడా గ్లైఫోసేట్‌కు ప్రత్యామ్నాయాలను వాడాలి. గర్భిణులు తొమ్మిది నెలలపాటు ఈ కలుపుమందు ప్రభావం అసలే పడకుండా జాగ్రత్త వహించాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.